**నేటి కందం- నేటికి అందం**

తప్పు సమాచారము నిడి
ముప్పును ఘటియింపబూను ముష్కరతతిపై
చప్పున నలుగుచు మోడీ
గొప్పగ శిక్షింతు ననెను క్రోధోద్ధురుడై !!

(తప్పుడు సమాచారంతో ముప్పు కలిగించే ప్రజాద్రోహులు గీత దాటితే కఠిన చర్యలు తీసుకుంటానని ప్రధాని నరేంద్ర మోడీ హెచ్చరించారు.) -రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం
తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

సినీమాలు థియేటర్లో
చూసేవారు తగ్గింద్రు
బుల్లితెర ఓటీటీల్లో
బహుచౌకకు మొగ్గింద్రు.
హైద్రాబాద్ వస్తేనేమి
హాలీవుడ్ బాలీవుడ్
ఆదలేని సంక్షోభం
ఆవరించే టాలీవుడ్.

శ్రీనిజం

- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245



హైదరాబాద్ శనివారం 14-3-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:172 పేజీలు:6 వెల: రూ.1/-


# మాజీ డీజీపీ మృతి.. సంతాపం తెలిపిన సీఎం




హైదరాబాద్, మార్చి 13: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ హెచ్. జె. దొర మరణించారు. ఆయన వయస్సు 83 సంవత్సరాలు. గత కొంత కాలంగా ఆయన కిడ్నీ సమస్యతో బాధపడుతున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో డయాలసిస్ చేయించుకున్నారు. అనంతరం ఇంటికి తిరిగి వెళ్లారు. ఇంట్లో బాత్‌రూమ్‌లో ఆయన పడిపోయారు. కుటుంబ సభ్యులు వెంటనే ఆయన్ని నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించినట్లు తెలుస్తోంది. ఆయన మృతిపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సంతాపం తెలిపారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇంటెలిజెన్స్ చీఫ్‌గా, డీజీపీగా ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. పోలీసు శాఖలో పలు సంస్కరణలు తీసుకురావడంతోపాటు శాఖను ప్రజలకు చేరువ చేయడంలో హెచ్. జె.దొర ఎంతో కృషి చేశారని తెలిపారు. దొర కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని సీఎం రేవంత్ తెలియజేశారు. 1965 ఐపీఎస్ బ్యాచ్ అధికారి హెచ్. జె.దొర. 1996 నుంచి 2002 వరకు ఉమ్మడి ఏపీ డీజీపీగా దొర విధులు నిర్వహించారు. ఈ సమయంలో ఉమ్మడి ఏపీలో నక్సలైట్లను అణిచివేయడంలో కీలకంగా వ్యవహరించారు. అలాగే సీఐఎస్ఎఫ్ డీజీగా, విజిలెన్స్ కమిషనర్‌గా సైతం దొర పని చేశారు.

# ఏపీకి రూ.341 కోట్లు

అమరావతి, మార్చి 13: కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు భారీ ఊరటనిస్తూ విపత్తు సహాయక నిధులను విడుదల చేసింది. గతేడాది అక్టోబర్‌లో సంభవించిన మొంథా తుపాను, దానివల్ల ఏర్పడిన ఆకస్మిక వరదల వల్ల దెబ్బతిన్న ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం అదనపు ఆర్థిక సాయాన్ని మంజూరు చేసింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన ఇవాళ జరిగిన ఉన్నత స్థాయి కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.ఆంధ్రప్రదేశ్ సహా 6 రాష్ట్రాలకు రూ.1,913 కోట్ల అదనపు నిధుల విడుదలకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆమోదం తెలిపారు. 2025లో వరదలు, మొంథా తుఫాను నష్టానికి సాయంగా ఈ మొత్తాన్ని చెల్లిస్తారు. గుజరాత్‌కు రూ.778 కోట్లు, ఏపీకి రూ.341 కోట్లు, జమ్మూకశ్మీర్‌కు రూ.330 కోట్లు, హిమాచల్ ప్రదేశ్‌కు రూ.288 కోట్లు, నాగాలాండ్‌కు రూ.158 కోట్లు, ఛత్తీస్‌గఢ్‌కు రూ.15 కోట్లు అందనున్నాయి.

# గ్యాస్ కొరత లేకుండా చూసే బాధ్యత మాది: మంత్రి ఉత్తమ్



హైదరాబాద్, ఫిబ్రవరి 13: దేశవ్యాప్తంగా నెలకొన్న ఇంధన, గ్యాస్ సరఫరా పరిణామాలపై తెలంగాణ ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టింది. అత్యవసర సేవలకు ఎటువంటి ఆటంకం కలగకుండా గ్యాస్ సరఫరాను క్రమబద్ధీకరించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గ్యాస్ సరఫరా అనేది పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశమని గుర్తు చేస్తూ.. ప్రస్తుత పరిస్థితులపై మంత్రి ఉత్తమ్ పలు కీలక వివరాలను వెల్లడించారు.

**కేంద్రం గైడ్ లైన్స్ – రాష్ట్ర ప్రభుత్వ చర్యలు**

మార్కెట్‌లో కొంత మేర గ్యాస్ కొరత ఉందని కేంద్ర ప్రభుత్వమే స్వయంగా ప్రకటించిందని, దానికి అనుగుణంగా రాష్ట్రాలకు కొన్ని మార్గదర్శకాలను జారీ చేసిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

ఉత్పత్తి పెంపు: ఒఖఉ ప్రొడక్షన్‌ను పెంచామని కేంద్రం తెలిపిందని, ఈ నేపథ్యంలో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలతో సమన్వయం కోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

కిరోసిన్ సప్లై: తెలంగాణ రాష్ట్రానికి 1740 కిలో లీటర్ల కిరోసిన్ సరఫరా చేస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని మంత్రి పేర్కొన్నారు.

**రాష్ట్ర స్థాయి పర్యవేక్షణ: కమాండ్ కంట్రోల్ రూమ్**

స్టేట్ లెవల్ కమిటీ: ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (అూ) నేతృత్వంలో సివిల్ సప్లై కమిషనర్, పోలీస్ అధికారులు, ఇతర ఉన్నతాధికారులతో రాష్ట్ర స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు.

జిల్లా స్థాయి కమిటీలు: ప్రతి జిల్లాలో కలెక్టర్, ఎస్పీ, వైద్య అధికారులు ఒఖఉ కంపెనీ ప్రతినిధులతో కూడిన కమిటీలు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తాయి.

కమాండ్ కంట్రోల్ రూమ్: హైదరాబాద్‌లోని సివిల్ సప్లై కార్యాలయంలో ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి, సరఫరాలో అంతరాయాలను నివారిస్తున్నారు.

**హోటల్స్, రెస్టారెంట్ల విజ్ఞప్తి**

తమను కూడా అత్యవసర సేవల కింద గుర్తించి సిలిండర్లు సరఫరా చేయాలని హోటల్, రెస్టారెంట్ యజమానులు చేసిన విజ్ఞప్తిని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అత్యవసర సేవలకు గ్యాస్ కొరత లేకుండా చూసే పూర్తి బాధ్యత మా ప్రభుత్వం తీసుకుంటుందని ఉత్తమ్ చెప్పారు.

# హోర్ముజ్ జలసంధిలో నౌకలపై దాడి.. ఇప్పటివరకు ముగ్గురు భారతీయులు మృతి



న్యూఢిల్లీ, మార్చి 13:హోర్ముజ్ జల సంధిలో ఇప్పటివరకు జరిగిన దాడుల్లో ముగ్గురు భారతీయులు మరణించారని కేంద్రం వెల్లడించింది. మరొకరు గల్లంతయ్యారు. అలాగే శుక్రవారం మరో భారత నౌక ఈ జలసంధిని దాటింది. ఇంకా 27 నౌకలు ఇంకా ఈ జలసంధి మార్గంలో చిక్కుకున్నాయి. ఈ నౌకల్లో ఇంకా 700 మందికిపైగా సిబ్బంది చిక్కుకుపోయారు. ఈ వివరాల్ని కేంద్రం శుక్రవారం వెల్లడించింది. ఇరాన్ యుద్ధం కారణంగా హోర్ముజ్ జలసంధి మార్గంలో ఇండియా నౌకలతోపాటు అనేక దేశాలకు చెందిన నౌకలు చిక్కుకు పోయాయి.

ఈ అంశంపై కేంద్ర నౌకాయాన మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేష్ కే సిన్హా ఈ అంశంపై ప్రకటన చేశారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. హోర్ముజ్ జలసంధి మార్గంలో ఉన్న భారత నౌకల భద్రత గురించి కేంద్రం పర్యవేక్షిస్తోంది. ఇండియాకు చెందిన ఒక నౌక శుక్రవారమే ఈ మార్గాన్ని దాటింది. అయితే, ఈ నౌక జలసంధికి తూర్పు వైపు ఉండటం వల్ల ప్రధాన మార్గం నుంచి వెళ్లాల్సిన అవసరం లేదు. ఈ నౌక ఇండియాకు రావడం లేదు. ఆఫ్రికాకు వెళ్తోంది. ప్రతి భారతీయ నౌక గురించి ప్రభుత్వం సమీక్షిస్తోంది. హోర్ముజ్ జలాల్లో మొత్తం 27 ఇండియన్ నౌకలున్నాయి. వాటిలో పశ్చిమ ప్రాంతం వైపు 24 నౌకలు, వాటిలో 677 మంది సిబ్బంది ఉన్నారు. తూర్పు వైపు నాలుగు నౌకలు ఉండగా, ఒకటి ఈ ప్రాంతాన్ని దాటింది. దీంతో ఇక్కడ మూడు నౌకలు చిక్కుకుపోయాయి.

వీటిలో 76 మంది వరకు ఉన్నారు. గల్ఫ్ సముద్ర తీరాల్లో నిత్యం 23,000 మంది భారతీయులు నౌకల్లో పని చేస్తుంటారు. వీరంతా వేర్వేరు మార్గాల్లో ప్రయాణిస్తారు. ఈ ప్రాంతంలో ఇప్పటివరకు జరిగిన దాడుల్లో ఇప్పటివరకు ముగ్గురు భారతీయులు మరణించారు. మరొకరు గల్లంతయ్యారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు రాజేష్ కే సిన్హా తెలిపారు.

# ఇంటర్ పరీక్షలు పూర్తి..ముమ్మర నిఘాతో తగ్గిన మాల్‌ప్రాక్టీస్ కేసులు : ఇంటర్ బోర్డ్

హైదరాబాద్, మార్చి 13:రాష్ట్రంలో ఇంటర్ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. ఫిబ్రవరి 25 నుంచి ప్రారంభమైన ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం పరీక్షలు పగడ్బందీ ఏర్పాట్లు చేయడంతో ప్రశాంతంగా ముగిశాయని ఇంటర్ బోర్డు కార్యదర్శివెల్లడించారు.

నిరంతర నిఘా, జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిఘాను పటిష్టంగా అమలు చేయడం, పరీక్ష కేంద్రాల తనిఖీల వల్ల మాల్ ప్రాక్టీస్ కేసులు గణనీయంగా తగ్గుముఖం పట్టాయని వెల్లడించారు. గత ఏడాది 2025 లో రాష్ట్రవ్యాప్తంగా 115 మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదవగా ఈ యేడాది 54 మాత్రమే కేసులు నమోద య్యానట్లు వివరించారు. స్టేట్ అబ్జర్వర్లు, హైపవర్ కమిటీ, జిల్లా పరీక్షల కమిటీ, ఫ్లయింగ్ స్క్వాడ్లు, సిట్టింగ్ స్క్వాడ్లు 10,426 కేంద్రాలను సందర్శించారని పేర్కొన్నారు. గత ఏడాది కంటే 1,876 కేంద్రాలను అధికంగా సందర్శించారని వివరించారు.

# కనుమరుగు కానున్న ముంబై తెలుగువారి తొలి చిరునామా



కమాటిపురా..!
కడుపు నింపుకోవడానికి
కడుపు కింది అవయవమ్మిాద
పాలకులే రాజముద్ర వేసిన
ప్రేమాటిపురా..!

ఒకప్పటి ముంబై తెలుగువారి వైభవోపేతమైన చరిత్రకు సాక్ష్యం పలికిన కమాటిపురా త్వరలోనే కనుమరుగు కానుంది. తన

ఆనవాళ్ళనే కాకుండా, తన పేరును కూడా కాలగర్భంలో పోగొట్టుకోనుంది. మొదట్లో కమాటిపురా అంటే ఇప్పటిలాగా ఒక తిట్టుకాదు..

ఒక అద్వితీయమైన తెలుగువారి చరిత్ర..! ఎందరో మహానుభావుల అడ్డా..! ముంబై సామాజిక గమనాన్ని మార్చిన ఉద్యమాల నెలవు..

శతాబ్దాల క్రితం కొలాబాలోని చేపల మార్కెట్ వద్ద స్థిరపడ్డ తెలుగు ప్రజలు ఆ చేపల వాసన భరించలేక అనారోగ్యం పాలై, ప్రభుత్వ

చేయూతతో స్థలాంతరం చెంది, ఉప్పు పొలాల్లోకి మారి, తెలుగు వాడలు నిర్మించుకున్న స్థలం పేరే కమాటిపురా..! ప్రణాళిక బద్దంగా, అందంగా, చూడచక్కని వీధులతో, ఏడు మందిరాలతో, సామాజిక సంస్థలతో తెలుగు వారు ముచ్చటపడి నిర్మించుకున్న ఆ ప్రదేశమేకమాటిపురా.!

మహాత్మ జ్యోతిరావు ఫులే, డా॥ బాబా సాహెబ్ అంబేద్కర్ లాంటి మహనీయుల్ని ఆర్థికంగా, సామాజికంగా ఆదుకున్న తెలుగు వారు నివసించిన ప్రదేశమే కమాటిపురా..! ఎన్నో ఉద్యమాలు జరిగిన ప్రాంతం.. ఎందరో నాయకులు, పారిశ్రామికవేత్తలు, భవన నిర్మాతలు ఉద్భవించిన చోటు.. ముంబైలో కమాటిపురాను ప్రస్తావించకుండా తెలుగువారి చరిత్ర పూర్తికాదు.

జాతి విద్వేషులు కొందరు, ఉత్తర భారతీయ ఆధిపత్య, అక్రమ వలసదారులు కొందరు తమ అజ్ఞానంతో, మూర్ఖత్వంతో, గౌరవప్రదంగా ఉచ్చరించాల్సిన 'కమాటిపురా' ను అవమానప్రదమైన పదబంధంగా మార్చేశారు.. అప్పట్లో 'కామ్','మట్టి'... 'మట్టి కా కామ్' చేసే మన తెలుగువాళ్ళు ఉండే ప్రాంతం గనుక అది 'కామ్‌మట్టి పురా' అంటే 'కమాటిపురా' గాఅయింది.

ఆ కాలంలో విదేశీ పాలకులు బ్రిటిష్ అధికారులతో పరిపాలన సాగించేవారు. సంవత్సరాల తరబడి ముంబైలో ఉండడం వల్ల

ఆ విదేశీ అధికారుల కామకోరికల్ని తీర్చేందుకు ప్రభుత్వమే కమాటిపురాను ఆనుకొని ఉన్న ప్రాంతంలో కొందరు వేశ్యల్నిఅధికారికంగా నియమించింది. అప్పట్లో ఆ రోడ్‌ను ఫాక్‌లండ్ రోడ్ / పారస్‌రోడ్ అని పిలిచేవారు. నిజానికి ఆ రోడ్ కమాటిపురానుఆనుకొని మాత్రమే ఉంది. కానీ, రానూరానూ కమాటిపురా ప్రాంతం మొత్తాన్ని రెడ్‌లైట్ ఏరియా గా వ్యవహరించసాగారు. ముంబైలో రెడ్‌లైట్ ఏరియా అంటే కమాటిపురా అనేంతగా దుష్ప్రచారం పొందింది. కానీ, తెలుగువారు ఏర్పాటు చేసుకున్న కమాటిపుర గల్లీలు (లేన్‌లు) రెడ్ లైట్ ఏరియాలు కావు.

కమాటిపురాలో తెలుగు వారికి చెందిన సొంత భవనాలెన్నో ఉన్నాయి. రోడ్లకి తెలుగువారి పేర్లున్నాయి. మందిరాలు తెలుగువారివే..! తెలుగువారికి చెందిన అతిపెద్ద సంస్థలు, మున్నూర్‌వార్ జ్ఞాతి గంగ, అఖిల పద్మశాలి సమాజం లాంటివి ఇక్కడేఉన్నాయి. తెలుగు పుస్తకాలయాలు, తెలుగు దుకాణాలు ఇక్కడ సర్వసాధారణం..

కాలం మారింది.. మారుతోంది.. కొన్నేండ్ల క్రితం కమాటిపురా అభివృద్ధి పేరుతో కొందరిని భవనాలు ఖాళీ చేయించి సయాన్

ప్రతీక్షా నగర్ లోని ట్రాన్సిట్ క్యాంప్‌లకు తరలించారు. దశాబ్దాల తర్వాత కూడా వారు తిరిగి కమాటిపురాకు చేరుకోలేదు. తెలుగువారిస్థానాన్ని గుజరాతీలు, మార్వాడీలు, ముస్లింలు ఆక్రమించారు.

ఇప్పుడు మళ్ళీ కమాటిపురాను పూర్తిగా కూల్చేసి టవర్‌లు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం అవుతున్నాయి.

అయితే, ఇప్పుడు కేవలం కమాటిపురా గల్లీల్లోని భవనాలను కూల్చడమే కాకుండా, కమాటిపురా అనే పేరునే మార్చేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.

కొన్నేండ్ల తర్వాత అక్కడ కమాటిపురా ఉండదు. ఆ ప్రాంతానికి మరో కొత్తపేరు రానుంది. ఏం పేరు పెడతారో ఇంకా నిర్ధారణ కాకపోయినా కొత్త పేరు పెట్టాలనే నిర్ణయం మాత్రం జరిగిపోయింది.

కమాటిపురాలో తెలుగువారి సంఖ్య ఇప్పటికే బాగా తగ్గింది. అయినప్పటికీ కమాటిపురా అంటే తెలుగు కేంద్రం అనే పేరుంది. కొన్ని రోజుల తర్వాత ఇహ ఆ పేరుండదు. తెలుగువారి తొలి చిరునామా అయిన కమాటిపురా తన రూపాన్నే కాదు.. పేరును కూడా మార్చుకోబోతుంది. పరిణామ క్రమంలో జరగబోయే ఈ అభివృద్ధికి సంతోషించాలో, తెలుగువారి మూలాలు పెకిలిపోతున్నందుకు బాధపడాలో అర్థం కాని పరిస్థితి..!

వ్యవస్థలన్నీ మార్కెటింగ్ ఆధారంగా కొనసాగున్న ప్రస్తుత తరుణంలో కమాటిపురా అనే పేరుకోసం ఉద్యమించే అవకాశాలు కూడా లేవు. కోట్ల రూపాయలు పెట్టి కట్టే టవర్‌లను కమాటిపురా పేరుతో అమ్ముకోవడం వ్యవస్థలకు సాధ్యం కాదు. అందుకే ఈ పేరుమార్పు సంకల్పం. కానీ, తెలుగు అభిమానులకు మాత్రం శరాఘాతం.. తప్పదు.. భరించాల్సిందే..!!



– సంగెవేని రవీంద్ర
9987145310

# గ్యాస్ కొరత ఏర్పడకుండా చూడాల్సిన బాధ్యత కేంద్రానిదే



**–గ్యాస్ కొరత ఏర్పడకుండా చూడాల్సిన బాధ్యత కేంద్రానిదే**
**–సామాన్యుడికి గుదిబండల గ్యాస్ బండ**
**–ప్రజలకు అందుబాటులో గ్యాస్ సిలిండర్లు ఉండేలా చూడాలి**
**–గ్యాస్ డీలర్లు గ్యాస్ కొరత సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు**
**–తెలంగాణ ఐటి, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**

ఖమ్మం, మార్చి 13:ప్రపంచంలో జరుగుతున్న యుద్ధం పరిణామాల దృష్ట్యా గ్యాస్ కొరత ఏర్పడిందని, గ్యాస్ కొరత ఏర్పడకుండా చూడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే అని తెలంగాణ ఐటి, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. శుక్రవారం మంథని పట్టణం పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా గ్యాస్ బండ సామాన్యుడికి గుడిబండల మారిందని తెలిపారు.

యుద్ధ వాతావరణం ఏర్పడిన సందర్భంలో గ్యాస్ కొరత ఏర్పడిందని, సామాన్యుడికి గ్యాస్ బండ అందేలా చర్యలు చేపట్టాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వాన్ని పేర్కొన్నారు. గ్యాస్ ఏజెన్సీ డీలర్లు గ్యాస్ సిలిండర్లను బ్లాక్ లో విక్రయించినట్లు తెలిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం సామాన్యుడికి అందుబాటులో గ్యాస్ సిలిండర్లు ఉండేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్యాస్ కొరత లేకుండా ప్రభుత్వం పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తుందని మంత్రి పేర్కొన్నారు.


ఇప్పటికే గ్యాస్ నిలువల గురించి పౌరసరఫల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేశామని, సామాన్యుడికి అందుబాటులో సిలిండర్ ఉండేలా చర్యలు చేపడతామని ఆయన పేర్కొన్నారు.

రాష్ట్రంలో గ్యాస్ విలువల గురించి ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వానికి వివరిస్తున్నట్లు మంత్రి వివరించారు. ప్రపంచవ్యాప్తంగా యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో భారత ప్రధాని మోడీ గ్యాస్ సరఫరా గురించి తక్షణమే స్పందించాలని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

దేశంలో ప్రస్తుతం గ్యాస్ నిల్వాలు ఎన్ని ఉన్నాయి, ఇంకా ఎన్ని రోజులకు సరిపడా ఉంటాయి అనే విషయం కేంద్ర ప్రభుత్వం ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ఉందని మంత్రి తెలిపారు. ముడి చమురు నిలువల గురించి కూడా కేంద్ర ప్రభుత్వం వివరించాలని మంత్రి పేర్కొన్నారు.

రాష్ట్రానికి సంబంధించినటువంటి గ్యాస్ సరఫరా, ముడి చమురు సరఫరా గురించి కేంద్ర ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు వివరాలు తెలుపుతున్న మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రానికి ఎలాంటి కొరత కలుగకుండా సరఫరా చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మంథని మున్సిపల్ చైర్ పర్సన్ వోడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదల వెంకన్న, మండల పార్టీ అధ్యక్షుడు అయిలి ప్రసాద్, తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి సభ్యులు, న్యాయవాది శశిభూషణ్ కాచే, నాయకులు సేగ్గం రాజేష్, మంథని సత్యం, సోషల్ మీడియా ఇన్చార్జి ఆరేళ్లి కిరణ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ 'పై' దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుందాం !

## (14 మార్చి "జాతీయ 'పై' దినోత్సవం" సందర్భంగా)

గణితశాస్త్రంలో అత్యద్భుత సంఖ్యగా 'పై' స్థిరాంకానికి పేరుంది. వైజ్ఞానికశాస్త్ర వివిధ రంగాల్లో 'పై' స్థిరాంకానికి ఎనలేని ప్రాధాన్యత కల్పించబడింది. ఒక వృత్తపు చుట్టుకొలత (సర్కంఫెరెన్స్), వ్యాసాల (డయామీటర్) మధ్య నిష్పత్తిని 'పై' విలువగా గుర్తించడం జరిగింది. గణితశాస్త్రంలో 'పై' విలువ 3.14159265 లేదా 22/7గా స్థిరీకరించబడింది. గణితం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, ఇంజనీరింగ్ లాంటి పలు వైజ్ఞానికశాస్త్ర విభాగాల్లో 'పై' ప్రాధాన్యం అనంతం. 1706లో ప్రఖ్యాత మాథమెటీషియన్ "విలియమ్ జోన్స్" కనుగొని తొలిసారి వాడిన 'పై' స్థిరాంకం నేటికీ, రానున్న అనంతకాల గమనానికి అతి ముఖ్యమైన సంఖ్యగా కొనియాడబడడం, విశేష అనువర్తనాలను కలిగి ఉండడం జరుగుతుంది.

### జాతీయ 'పై' దినోత్సవం-2026:

1988లో భౌతిక శాస్త్రవేత్త 'లారీ షా' చొరవతో ప్రతి ఏట మార్చి 14 (3/14)న 'పై' దినోత్సవాన్ని జరుపుకోవడం ప్రారంభించడం, తర్వాత 2009లో అమెరికన్ జాతీయ కాంగ్రేస్ కూడా ఈ ప్రతిపాదనను అంగీకరించడంతో "జాతీయ 'పై' దినోత్సవం" ఘనంగా జరుపబడుతున్నది. 'పై' విలువ 3.14 ఉండగా, 3వ నెల (మార్చి) 14వ తారీఖున, అనగా 3/14న 'పై' దినోత్సవం జరుపుకోవడం ఓ అద్భుత సందర్భం. అదే విధంగా ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ జన్మదినం (మార్చి 14, 1879) కూడా మార్చి 14న (అనగా 3/14) ఉండడం కూడా యాదృశ్చికంగా జరిగిపోయింది. మార్చి 14న "అంతర్జాతీయ గణితశాస్త్ర దినోత్సవం (ఇంటర్నేషనల్ మాథమెటిక్స్ డే)"గా కూడా ప్రపంచ దేశాలు నిర్వహించుకోవడం కొనసాగుతున్నది.

'పై' విలువ ప్రాధాన్యం తెలిసిన విద్యాలయాలు, పరిశోధనాలయాలు, విద్యావంతుల సమాజం, గణిత/భౌతిక/రసాయన శాస్త్రవేత్తలు, ఇతర సంబంధిత సంఘాలు జాతీయ 'పై' దినోత్సవాలను ఘనంగా నిర్వహించుకోవడం సముచితంగా ఉంటుంది. యునెస్కో 40వ సర్వసభ్య సమావేశంలో 2019లో ఈ వేడుకలను "అంతర్జాతీయ 'పై' దినోత్సవం"గా జరుపుకోవడం ముదావహం. గణితంలో త్రికోణమితి నుంచి జ్యామితి వరకు మాత్రమే కాకుండా వైజ్ఞానిక శాస్త్ర పరిశోధనలు, అంతరిక్ష విశ్వరూప వర్ణన, అణు పరమాణు నిర్మాణ వివరణలు, విద్యుత్ అయస్కాంత తరంగాలు, ఎలక్ట్రాన్ స్వభావ వివరణలు, క్వాంటం ఫిజిక్స్, ఇంజనీరింగ్ లాంటి అసంఖ్యాక రంగాల్లో 'పై' స్థిరాంకం అమూల్యమైన సంఖ్యగా గుర్తించబడింది.

విద్యార్థులు, వైజ్ఞానిక శాస్త్రవేత్తలతో పాటు ఆసక్తిగల పౌర సమాజం 'పై' స్థిరాంక విలువను తెలుసుకొని, దాని అద్భుత అనువర్తనాలను తెలుసుకొని సంతృప్తి పొందాలని, ఆ విలువతో గణిత ఆటలు ఆడుకోవడానికి ప్రయత్నిద్దాం.



-ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# "వికసిత భారత్ కోసం మనం వికసిత తమిళనాడును తీర్చిదిద్దడమే మా లక్ష్యం"

న్యూఢిల్లీ, మార్చి 13: ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు తమిళనాడులోని చారిత్రక నగరం తిరుచ్చిలో అనేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల తోపాటు ఆర్థిక వ్యవస్థ బలోపేతం లక్ష్యంగా పరిణామాత్మక అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ మేరకు రూ.5600 కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా కాలుష్య రహిత ఇంధనం, పెట్రోలియం సంబంధిత తయారీ, హైవే-రైల్వే, గ్రామీణ రహదారుల రంగాల్లో ఈ ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం, జాతికి అంకితం, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ- "ఇవన్నీ తమిళనాడు యువతకు ఇంధన లభ్యత, బహుళ రవాణా అనుసంధానం సహా వేలాది ఉద్యోగాలను సృష్టిస్తాయి" అని పేర్కొన్నారు.

సుస్థిర ఇంధనంపై దృష్టితో తలపెట్టిన భారత్ పెట్రోలియం సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ (సీజీడీ) నెట్‌వర్క్‌కు ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. మొత్తం రూ.3,700 కోట్ల విలువైన ప్రాజెక్టు దాదాపు 9 లక్షల కుటుంబాలు సహా అనేక వాణిజ్య సంస్థలకు 'పైప్డ్ నేచరల్ గ్యాస్' (పీఎన్‌జీ) సరఫరాతో పాటు నీలగిరి, ఈరోడ్ జిల్లాల రూపాంతరీకరణకు తోడ్పడుతుంది. దీనివల్ల ఒనగూడే పర్యావరణ ప్రయోజనాలను శ్రీ మోదీ ప్రముఖంగా ప్రస్తావిస్తూ- "కేవలం ఎనిమిదేళ్లలో ఈ ప్రాజెక్ట్ చూపే సానుకూల పర్యావరణ ప్రభావం ఏకంగా 4 కోట్ల మొక్కలు నాటడంతో సమానం" అని వివరించారు.

చెన్నైలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ 'లూబ్ బ్లెండింగ్ ప్లాంట్'ను జాతికి అంకితం చేయడాన్ని 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమ బలోపేతం దిశగా కీలక చర్యగా ఆయన పేర్కొన్నారు. ప్రపంచంలోనే ఇటువంటి భారీ సౌకర్యాలలో ఇదొకటి కాగా, రాష్ట్రంలో, రాష్ట్రేతర ప్రాంతాల్లోగల వివిధ పరిశ్రమల అదనపు డిమాండ్‌ను ఇది తీర్చగలదన్నారు. "లూబ్రికెంట్ల స్థానిక ఉత్పాదన పెరుగుదలతో దిగుమతులు తగ్గడమేగాక దేశానికి భారీగా నిధులు ఆదా అవుతాయి" అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమాల్లో భాగంగా ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన కింద నిర్మించిన 370 కిలోమీటర్ల గ్రామీణ రహదారులను ప్రధానమంత్రి ప్రారంభించారు. ఈ రహదారుల వినియోగం ద్వారా గ్రామీణ అనుసంధాన ప్రాముఖ్యం స్పష్టం కాగలదని ఆయన అన్నారు. ఆరోగ్య సంరక్షణ, విద్య, మార్కెట్ల సౌలభ్యం దిశగా ఈ రహదారులు గ్రామీణులకు ఇతోధికంగా తోడ్పడతాయని తెలిపారు. దీంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ప్రధాన స్రవంతితో అనుసంధానం కాగలదని చెప్పారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ- "ఈ రోజు ప్రారంభించిన గ్రామీణ రహదారులలో ప్రతి ఒక్కటీ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ వృద్ధితోపాటు జీవన సౌలభ్యాన్ని పెంచుతుంది" అని ప్రధానమంత్రి వివరించారు. ఈ ప్రాంతం సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించేలా- గంగైకొండ చోళపురం వద్ద కొత్త హైవే బైపాస్ ప్రాజెక్టును ప్రధానమంత్రి ప్రకటించారు. పవిత్ర స్థలం నుంచి భారీ ట్రాఫిక్‌ను మళ్లించడం ద్వారా రాజేంద్ర చోళ చక్రవర్తి నిర్మించిన ఆలయ వైభవాన్ని రక్షించడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. అలాగే యునెస్కో గుర్తింపు పొందిన స్మారక చిహ్నంతోపాటు అక్కడికి వచ్చే సందర్శకుల భద్రతకు భరోసా ఇస్తుంది. ఈ కొత్త మౌలిక సదుపాయాల గురించి శ్రీ మోదీ వివరిస్తూ- "దీని అంతరార్థం అందరికీ మెరుగైన భద్రత" అని ఆయన స్పష్టం చేశారు.

అమృత భారత్ కార్యక్రమం కింద ఇటీవల 8 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ, పునరాభివృద్ధి నేపథ్యంలో నేటి ప్రాజెక్టులు రాష్ట్ర రవాణా రంగంలో ఆధునికీకరణ వేగం పెంచుతాయని చెబుతూ ప్రధానమంత్రి పేర్కొన్నారు. అంతేకాకుండా తమిళనాడులో పర్యాటకం, స్థానిక వాణిజ్యాన్ని ప్రోత్సహించడంతోపాటు నాగర్ కోయిల్, కోయంబత్తూర్, రామేశ్వరం, తిరునల్వేలి, మైలాడుతురై, కారైక్కుడి వంటి కీలక ప్రదేశాలను ఇతర ప్రాంతాలతో అనుసంధానిస్తూ కొత్త రైలు సర్వీసులను కూడా ఆయన ప్రారంభించారు. చివరగా- రాష్ట్ర భవిష్యత్తుపై తన దార్శనికతను పునరుద్ఘాటిస్తూ- "రాష్ట్ర ప్రగతి కోసం మేం రాత్రింబవళ్లు చేస్తున్న కృషిని ఇకపైనా కొనసాగిస్తాం" అని హామీ ఇస్తూ ప్రసంగం ముగించారు.

# పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు..

**-27,360 మంది విద్యార్థులకు 149 సెంటర్లు.**
**-వేసవి నేపథ్యంలో ప్రత్యేక సౌకర్యాల కల్పన.**
**-మంచినీటి సౌకర్యంతో పాటు వైద్య శిబిరాలు.**
**-నో మొబైల్ జోన్లుగా పరీక్షా కేంద్రాలు..**
**-9154970454 నంబరుతో జిల్లాస్థాయి కంట్రోల్ రూమ్..**
**-ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**




అమరావతి, మార్చి 13: ఈ నెల 16వ తేదీ నుంచి ఏప్రిల్ 1 వరకు జరగనున్న పదో తరగతి పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తు న్నామని.. ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా విద్యార్థులు సజావుగా పరీక్షలు రాసేందుకు సౌకర్యాలు కల్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. పదో తరగతి పరీక్షల నిర్వహణపై శుక్రవారం కలెక్టర్ లక్ష్మీశ.. డీఈవో ఎల్.చంద్రకళతో కలిసి కలెక్టరేట్ లోని శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. 13,909 మంది బాలురు, 13,451 మంది బాలికలు మొత్తం 27,360 మంది విద్యార్థులకు 149 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష జరుగుతుందని.. విద్యార్థులను ఉదయం 8.30 గంటల నుంచి అనుమతించడం జరుగుతుందన్నారు.

విద్యార్థులు పరీక్షా కేంద్రానికి డిజిటల్ వాచ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకొని రాకూడదన్నారు. పరీక్షా కేంద్రాలను నో మొబైల్ జోన్లుగా ప్రకటించడం జరిగిందని.. 144 సెక్షన్ అమలుచేయనున్నట్లు పేర్కొన్నారు. వెయ్యి మీటర్లలోపు జిరాక్సు షాపులు తెరిచి ఉండకూడదని స్పష్టం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. విద్యార్థులు హాల్ టిక్కెట్ చూపించి ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం పొందవచ్చన్నారు. ఎన్నడూ లేని విధంగా గౌరవ సీఎం, గౌరవ విద్యాశాఖ మంత్రివర్యుల దార్శనికతకు అనుగుణంగా 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను పటిష్టంగా అమలు చేసి విద్యార్థులను పూర్తిస్థాయిలో పరీక్షలకు సన్నద్ధం చేశామని.. పదో తరగతి పరీక్షలు రాయబోయే విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు లక్ష్మీశ తెలిపారు.

విద్యార్థులు పరీక్షలకు సంబంధించి ఎలాంటి సందేహాలున్నా జిల్లాస్థాయి కంట్రోల్ రూమ్ (9154970454) నంబరుకు ఫోన్ చేయవచ్చని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.

అత్యంత పారదర్శకంగా పరీక్షల నిర్వహణ: డీఈవో ఎల్.చంద్రకళ

పదో తరగతి పరీక్షలను అత్యంత పారదర్శకంగా, జవాబు దారీతనంతో నిర్వహించడం జరుగుతుందని.. పరీక్షా కేంద్రాల్లో ఫర్నిచర్, విద్యుత్ వసతి, మంచినీరు, ఇతర అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించినట్లు డీఈవో ఎల్.చంద్రకళ తెలిపారు. హాల్ టిక్కెట్‌లో పొందుపరిచిన సూచనలు పాటిస్తూ విద్యార్థులు సజావుగా పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించాలన్నారు.

విద్యార్థులు తమ హాల్ టికెట్ నంబరును ఆన్సర్ స్క్రిప్ట్ లేదా ఓఎంఆర్ షీట్‌పై ఎక్కడా రాయకూడదని సూచించారు. 300 మంది సిబ్బందిని చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లుగా నియమించడం జరిగిందన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా విద్యార్థుల సబ్జెక్టు నైపుణ్యాలను పూర్తిస్థాయిలో మెరుగుపరిచి, పరీక్షలకు సన్నద్ధం చేసినట్లు డీఈవో ఎల్.చంద్రకళ తెలిపారు. ప్రత్యేక అవసరాలున్న (సీడబ్ల్యూఎస్ఎన్) 193 మంది విద్యార్థులకు స్క్రైబ్‌లను ఏర్పాటు చేయడం జరిగిందని.. వీరికి గ్రౌండ్ ఫ్లోర్‌లోనే పరీక్ష రాసేందుకు ఏర్పాట్లు చేశామని వివరించారు.

# ఎం ఎస్ ఎం పరిశ్రమలను బలోపేతం చేస్తాం..

## -ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

**-ఎం ఎస్ ఎం ఈ అసోసియేషన్ ఎక్సపో ప్రారంభం**

**-ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు తో కలిసి ఎక్స్ పో ను ప్రారంభించిన ఎంపీ కేశినేని చిన్ని**



విజయవాడ, మార్చి 13: రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఎం ఎస్ ఎం ఈ పరిశ్రమల అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వం సైతం సంపూర్ణ సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. విజయవాడ లబ్బీపేట ఎస్ ఎస్ కవంక్షన్ హాల్ లో ఏపీ ఎం ఎస్ ఎం ఈ ఇండస్ట్రీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎం ఎస్ ఎం ఈ ఎక్స్ పో - 2026 ను ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) స్థానిక ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు కలసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ముందుగా ఎక్సపోలో ఏర్పాటుచేసిన సుమారు 100కు పైగా వివిధ పరిశ్రమలకు చెందిన స్టాల్స్ ను, ఆయా పరిశ్రమల ఉత్పత్తులను ఎంపీ, ఎమ్మెల్యే పరిశీలించారు.

మూడు రోజులపాటు నగరంలో జరగనున్న ఎం ఎస్ ఎం ఈ ఎక్స్ పో ప్రారంభ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సభలో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ,... హైదరాబాద్ వంటి ప్రాంతంలో ఎం ఎస్ ఎం ఈ పరిశ్రమలు త్వరితగతిన వృద్ధి చెందుతాయని, రాష్ట్రంలోని విజయవాడ, విశాఖపట్నంలో సైతం ఎం ఎస్ ఎం ఈ పరిశ్రమలు వృద్ధి చెందుతున్నాయి అంటే దానికి ఆంధ్రప్రదేశ్ ఎం ఎస్ ఎం ఈ ఇండస్ట్రీస్ అసోసియేషన్ కృషి, చిన్న వ్యాపారుల సంకల్పం ఎంతో ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతి ఇంటిలోనూ ఒక పారిశ్రామికవేత్త ఉండాలని సంకల్పంతో పారిశ్రామిక అభివృద్ధి దిశగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకు వెళుతున్నారన్నారు. ప్రభుత్వ సంకల్పం ఆచరణలో నిజం కావాలంటే ఎం ఎస్ ఎం ఈ పరిశ్రమల అభివృద్ధితోనే సాధ్యపడుతుందన్నారు.

ఎం ఎస్ ఎం ఇ పరిశ్రమల స్థాపనతో క్షేత్రస్థాయిలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన జరుగుతుందని, ప్రభుత్వం సంకల్పించిన నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పన ఆచరణలో జరుగుతుందన్నారు. ఎం ఎస్ ఎం ఈ పరిశ్రమల అభివృద్ధికి, స్థాపనకు ప్రభుత్వం సంపూర్ణ సహకారాన్ని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అందిస్తుందని, ఎన్టీఆర్ జిల్లాలో కూడా ఎం ఎస్ ఎం ఈ పరిశ్రమలు వృద్ధి చెందేందుకు కృషి చేస్తామన్నారు. విజయవాడలో ఏర్పాటుచేసిన ఎక్స్పో తరహాలోనే రానున్న కాలంలో జిల్లాలోని జగ్గయ్యపేట, మైలవరం ప్రాంతాలలో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎక్స్పోలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. దేశీయ పరిశ్రమల ఉత్పత్తులనే కాకుండా రాష్ట్రంలో పరిశ్రమలు తయా రుచేసిన ఉత్పత్తులతో ఎక్స్పో ఏర్పాటు చేసినందుకు నిర్వాహ కులను ఎంపీ కేశినేని శివనాథ్ అభినందించారు.

ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు మాట్లాడుతూ.. చంద్రబాబు నోటి వెంట పారిశ్రామిక అభివృద్ధి అనే మాట వచ్చిందంటే అది జరిగి తీరుతుంది అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో సైతం ఉపాధి కల్పన జరగాలంటే ఎం ఎస్ ఎం ఈ పరిశ్రమలు మరింతగా స్థాపన జరగాలన్నారు. ఎం ఎస్ ఎం ఈ రంగానికి ప్రభుత్వ సహకారం పూర్తిగా ఉంటుందని చెప్పారు. ఏపీ ఎం ఎస్ ఎం ఈ ఇండస్ట్రీస్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు బాయన వెంకట్రావు మాట్లాడుతూ వందకు పైగా స్టాల్స్ ను ఎక్స్పోలో ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఆంధ్రప్రదేశ్ స్మాల్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షులు మలినేని నారాయణ ప్రసాద్, ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్ పర్సన్ కె.పార్వతమ్మ, ఎం ఎస్ ఎం ఈ అసోసియేషన్ అధ్యక్షులు డి దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఎవెమ్మన్ రామచంద్రరావు, కోశాధికారి జే వి ఎస్ ఆర్ కే ప్రసాద్, ఎక్స్పో కమిటీ చైర్మన్ సాంబశివరావు, సభ్యులు టీవీ నాగేశ్వరరావు, ఎం అమర్నాథ్, ఐలా మాజీ అధ్యక్షుడు సుంకర దుర్గాప్రసాద్, టాటా ఐలా సర్వీస్ సొసైటీ జే ఆర్ డి చైర్మన్ టి వినోద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# సాంప్రదాయ వైద్య రంగంలో ఉమ్మడి పరిశోధనను బలోపేతం చేసే దిశగాకీలక ముందడుగు

న్యూఢిల్లీ, మార్చి 13:వైద్య రంగంలో ఉమ్మడి పరిశోధన ప్రాజెక్టు కోసం సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఆయుర్వేదిక్ సైన్సెస్ (సీసీఆర్ఏఎస్)-సెంట్రల్ ఆయుర్వేద రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సీఏఆర్ఐ) న్యూఢిల్లీ, జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం, ఏ అండ్ యూ టిబ్బియా కాలేజ్, హాస్పిటల్ మధ్య ఓ త్రైపాక్షిక అవగాహన ఒప్పందం కుదిరింది. మార్చి 6, 2026న న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో కింద పేర్కొన్న శీర్షికతో ఈ ఒప్పందం కుదిరింది.

"ఆరోగ్యవంతులైన పెద్దల్లో జీవక్రియ, వ్యాధి నిరోధక ప్రతిస్పందనలు, మైక్రోబయోమ్ మార్కర్లపై వసంతకాలపు వాంతి చికిత్స (వాసంతిక వామన) ప్రభావం-ఒక అన్వేషణాత్మక యాదృచ్ఛిక నియంత్రిత అధ్యయనం".

వాసంతిక వమనం వల్ల కలిగే ఆరోగ్య ప్రభావాలను పరిశీలించడానికి, దాని వెనకున్న శాస్త్రీయ ఆధారాన్ని అన్వేషించడానికి ఈ ఉమ్మడి పరిశోధన కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ ప్రక్రియ ద్వారా పూర్తి ఆరోగ్యవంతులైన వయోజనుల్లో జీవక్రియ, వ్యాధి నిరోధక ప్రతిస్పందనలు, మైక్రోబయోమ్ మార్కర్లపై దీని ప్రభావాలను అంచనా వేస్తారు. కఠినమైన వైద్య పరిశోధన పద్ధతుల ద్వారా ఆయుర్వేద చికిత్సల్లో శాస్త్రీయమైన ఆధారపూర్వకమైన అవగాహనను రూపొందించాలనే ఉమ్మడి నిబద్ధతను ఈ అధ్యయనం ప్రతిబింబిస్తుంది.

ఈ ఒప్పంద సమయంలో జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం నుంచి ప్రొఫెసర్ కేదార్ సింగ్ (పరిశోధన, అభివృద్ధి డైరెక్టర్డీ), ప్రొఫెసర్ అరుణ్ ఖారత్, ప్రొఫెసర్ అమల్ చంద్ర (స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్), సీసీఆర్ఏఎస్-సీఏఆర్ఐ నుంచి డాక్టర్ హేమంత పాణిగ్రాహి (ఇనిస్టిట్యూట్ ఇన్‌ఛార్జ్), డాక్టర్ బబితా యాదవ్, డాక్టర్ షైజీ లయిక్, డాక్టర్ రేణు రాణి హాజరయ్యారు.

ఈ భాగస్వామ్యం ద్వారా సమగ్ర ఆరోగ్య సంరక్షణను అభివృద్ధి చేయడంలో, సంప్రదాయ చికిత్సా విధానాలకు శాస్త్రీయ ఆధారాలను బలపేతం చేయడానికి అర్థవంతమైన ఫలితాలను ఇస్తుందని ఆశిస్తున్నారు.

# గంజాయి మత్తు పదార్థాల పై అవగాహన ర్యాలీ..

**-గంజాయి , మత్తు పదార్థాలు నిర్వహిస్తే కఠిన చర్యలు**

**-ఒంగోలుడీఎస్పీ రావిపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ర్యాలీ**

అమరావతి, మార్చి 13: చీమకుర్తి మండలం లోని బుదవాడ పంచాయతీ మర్రిచెట్ల పాలెం గ్రామంలో శుక్రవారం ఉదయం ఒంగోలు డియస్ రావిపాటి శ్రీనివాసరావు గారి అద్వర్యం లో, చీమకుర్తి సి ఐ డి.ప్రసాదు మరియు ఒంగోలు సబ్ డివిజన్ పరిధిలో ఏడు మంది ఎస్ఐ లు మరియు కానిస్టేబుల్ సిబ్బంది 35 మంది గ్రామం లోని ఎస్టీ కాలనీ లో కార్డన్ సెర్చ్ నిర్వంచడమైనది. గ్రామంలో అనుమానిత వ్యక్తులు ను మరియు వాహనాలు ను తనిఖి చేయగా, 8 మోటార్ సైకిల్ ల కు ఎలాంటి డాకుమెంట్స్ లేనందున స్వాదిన పర్చుకోనడ మైనది.

అదే విధం గా మర్రిచేట్లపాలెం గ్రామం లోని ఎస్టీ కాలనీ లో గంజాయి మరియు మత్తు పదార్ధలు గురించి అవగాహన నిమ్మిత్తం, గ్రామం లోని ప్రజల తో ఒంగోలు డిఎస్పి రావిపాటి శ్రీనివాసరావు గారి అద్వర్యం లో ర్యాలి ని నిర్వంచడ మైనది మరియు గంజాయి గురించి గ్రామ ప్రజల తో ప్రతిజ్ఞ కూడా చేయించడ మైనది. ఈ కార్యక్రమంలో ఒంగోలు డీఎస్పీ రావిపాటి శ్రీనివాసరావు, చీమకుర్తి సిఐ డి. ప్రసాదు, ఒంగోలు సబ్ డివిజన్ పరిధిలో ఏడు మంది ఎస్ఐ లు మరియు 35కానిస్టేబుల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు : తాడికొండ సీతయ్య



నల్గొండ, మార్చి 13:మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు అని బీఆర్ఎస్ తుంగతుర్తి మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మసీదులో ముస్లింలకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసి మాట్లాడారు. రంజాన్ ముస్లిం సోదరులకు పవిత్ర మాసమన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఆచరించే ముస్లిం సోదరులకు ఇచ్చే ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు గుండగాని రాములు గౌడ్, గుండగాని దుర్గయ్య, తడకమల్ల రవికుమార్, కరుణాకర్, బొజ్జ సాయికిరణ్, కొండగడుపుల వెంకటేశ్ పాల్గొన్నారు.

# తెలంగాణ రైతులకు భారీ బహుమతి ప్రకటించిన కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్

న్యూఢిల్లీ, మార్చి 13:రైతుల ప్రయోజనాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. 2026 రబీ సీజన్‌కు గాను తెలంగాణలో మొత్తం 1,25, 855 మెట్రిక్ టన్నుల పంటను కనీస మద్దతు ధర వద్ద సేకరించాలన్న తెలంగాణ ప్రభుత్వ ప్రతిపాదనకు కేంద్ర వ్యవసాయ-రైతు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ ఆమోదం తెలిపారు.

ఈ పంటల సేకరణను ధర మద్దతు పథకం (పీఎస్ఎస్-ప్రైజ్ సపోర్ట్ స్కీమ్) కింద చేపట్టనున్నారు. ఇందులో భాగంగా 29,860 మెట్రిక్ టన్నుల శనగలు.. 37,020 మెట్రిక్ టన్నుల మినుములు.. 55,285 మెట్రిక్ టన్నుల వేరుశనగ.. 3,690 మెట్రిక్ టన్నుల పొద్దుతిరుగుడు పువ్వు కొనుగోలు చేయనున్నారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ ఆమోదించిన ఈ సేకరణ మొత్తం విలువ 894 కోట్ల రూపాయలకు పైగా ఉంటుంది.

రైతులను మార్కెట్ ఒడిదుడుకుల నుంచి రక్షించి వారి కష్టానికి తగిన పూర్తి ధర లభించేలా చూడటమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. ఈ ఆమోదం వల్ల తెలంగాణ రైతులు పంటకు గిట్టుబాటు ధర లభించడమే కాకుండా పప్పుధాన్యాలు, నూనెగింజల ఉత్పత్తికి కొత్త ఉత్తేజం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. దేశంలోని ప్రతి రైతు చేసిన కష్టానికి తగిన గౌరవం, విలువ దక్కాలన్నదే తమ సంకల్పమని ఆయన స్పష్టం చేశారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో రైతుల ఆదాయాన్ని పెంచడం, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయటం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించడానికి కేంద్రం తీవ్రంగా కృషి చేస్తోందని శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. ఈ నిర్ణయం వల్ల రైతులు ఉత్పత్తులను తక్కువ ధరలకు అమ్ముకోవాల్సిన అవసరం ఉండదని.. తద్వారా వారికి అటు ఊరట ఇటు ఆర్థిక భద్రత లభిస్తుందని ఆయన పేర్కొన్నారు.

ఈ నిర్ణయం వల్ల తెలంగాణలో శనగలు, మినుములు, వేరుశనగ, పొద్దుతిరుగుడు పంటలను సాగు చేసే రైతులకు నేరుగా ప్రయోజనం చేకూరుతుంది. ఇది రాష్ట్ర వ్యవసాయ రంగంలో స్థిరత్వం, భద్రత, సమృద్ధికి ఒక కొత్త దిశను నిర్దేశిస్తుంది.

# పార్లమెంటులో ప్రశ్న: మిషన్ మౌసమ్ అమలు తీరు

న్యూఢిల్లీ, మార్చి 13: 'మిషన్ మౌసమ్'లో భాగంగా, భూ విజ్ఞాన శాస్త్రాల శాఖకు చెందిన ఉన్నత పనితీరును ప్రదర్శించే కంప్యూటింగ్ (హై-పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్.. హెచ్‌పీసీ) వ్యవస్థల్ని ప్రధానమంత్రి 2024 సెప్టెంబరు 26న పుణేలోని ఇండియన్ ట్రాపికల్ మెటియరాలజీ ఇనిస్టిట్యూట్‌తో పాటు నోయిడాలోని నేషనల్ మీడియం రేంజ్ వెదర్ ఫోర్‌కాస్టింగ్ సెంటర్‌లో ప్రారంభించారు. "అర్క" , "అరుణిక" అనే పేర్లను పెట్టిన ఈ వ్యవస్థల్లో అర్క కంప్యూటింగ్ సామర్థ్యం 11.77 పెటాఫ్లాప్స్ ఉండగా, అరుణికకు 8.24 పెటాఫ్లాప్స్ సామర్థ్యాన్ని జోడించారు. దీనికి అదనంగా, 1.9 పెటాఫ్లాప్స్ సామర్థ్యంతో కూడిన కృత్రిమ మేధ (ఏఐ), మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్) వ్యవస్థల్నీ వీటికి జత పరిచారు. దీంతో మంత్రిత్వ శాఖ మొత్తం కంప్యూటింగ్ సామర్థ్యం 21.91 పెటాఫ్లాప్స్‌కు వృద్ధి చెందింది. గణనకు సంబంధించిన మౌలిక సదుపాయాల హంగును ఈ మేరకు పెంపొందింప చేయడంతో, వాతావరణం శీతోష్ణస్థితి అంశాల్లో ముందస్తు అంచనాను వెలువరించడానికి అధునాతనమైన అధిక స్పష్టతతో కూడిన నమూనాలను అభివృద్ధిపరిచేందుకూ, ఏఐతో పాటు ఎంఎల్ సేవల్ని వినియోగించుకొనేందుకూ మార్గం సుగమమైంది.

ఉష్ణమండల తుపానులకు సంబంధించి ముందస్తు అంచనాలు వేయడంలో 2016- 2020తో పోలిస్తే 2021-2025 మధ్య కాలంలో కచ్చితత్వాన్ని భారత వాతావరణ అధ్యయన విభాగం (ఐఎండీ) గణనీయంగా పెంచుకోగలిగింది. 48 గంటల వరకూ వర్తించే ముందస్తు అంచనా కాలానికి తుపాను కదలిక మార్గాన్ని అంచనా వేయడంలో పొరబాట్లు 5 నుంచి 10 శాతం మేరకు తగ్గాయి. ఇంతకన్నా ఎక్కువ ముందస్తు సూచన కాలాల విషయంలో ఈ లోపాలు 20 నుంచి 25 శాతం మేర తగ్గాయి. తీవ్రతను ముందుగా అంచనా వేయడంలో చెప్పుకోదగ్గ మెరుగుదల చోటుచేసుకొంది. 72 గంటల వరకూ ముందస్తు అంచనాను వేసే విషయంలో 33 నుంచి 35 శాతం వృద్ధి నమోదైంది. 96 గంటల ముందస్తు హెచ్చరిక కాలంలో పొరపాట్లు 10 శాతం వరకూ తగ్గిపోయాయి. అన్నిటి కన్న ఎక్కువ మెరుగుదల తుపాను తీరాన్ని దాటే వేళ విషయంలో భవిష్యవాణిని వెలువరించడంలో నమోదైంది.. ఇది తీర ప్రాంతాల నుంచి ప్రజలను అనువైన కాలంలోపే తరలించడానికి ఎంతో కీలకంగా మారింది. 24 నుంచి 48 గంటల ముందస్తు అంచనా కాలానికి తుపాను తీరాన్ని దాటే స్థలాన్ని చెప్పే విషయంలో పొరపాట్లు 35 నుంచి 45 శాతం వరకు తగ్గాయి. ఇతర ముందస్తు హెచ్చరిక కాలాల విషయంలో పొరపాట్లు దాదాపు 20 శాతం వరకూ తగ్గాయి. 2016-2020 మధ్య కాలంలో తుపాను సగటున 24 గంటలలో తీరాన్ని దాటే స్థలం విషయంలో పొరపాటు స్థాయి 31.9 కి.మీ. నుంచి తగ్గిపోయి, 2021-2025 మధ్య 19 కి.మీ.కి పరిమితమైంది. ఇక 48 గంటలలో తుపాను తీరం దాటొచ్చని చెప్పే విషయంలో పొరపాటు స్థాయి 61.5 కి.మీ. నుంచి 34.4 కి.మీ.కి పరిమితమైంది. వడగాడ్పుల ముందస్తు అంచనాను ప్రస్తుతం 4 రోజులు ముందు లేదా 5 రోజుల ముందు జారీ చేస్తున్నారు. దీంతో రాష్ట్రాల, జిల్లాల అధికార యంత్రాంగం వడగాడ్పుల సమస్యను ఎదుర్కొనేందుకు తగిన పథక రచనను ప్రభావవంతంగా అమలు చేయడానికి వీలవుతోంది. ఈ మెరుగుదల ఫలితంగా విశేష సామాజిక, ఆర్థిక ప్రయోజనాలు సమకూరాయి. వాటిలో.. తుపానుల వేళల్లో సకాలంలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, వర్షరుతు కాలంలో చక్కని వ్యావసాయిక ప్రణాళికలను అమలుపరచడం, విపత్తులు విరుచుకుపడే కన్న ముందే తగిన సన్నద్ధతతో ఉండగలగడం వంటివి ఉన్నాయి. ఫలితంగా ప్రాణ నష్టాన్నీ, ఆస్తి నష్టాన్నీ తగ్గించడం, అనేక రంగాల్లో ఆర్థిక కార్యకలాపాల్లో అంతరాయాలు తలెత్తకుండా నివారించడం సాధ్యమవుతోంది.

వాతావరణంతో పాటు శీతోష్ణస్థితి సంబంధిత సేవల అందజేతను మెరుగుపరచడం వల్ల కలుగుతున్న ప్రయోజనాలను భూ విజ్ఞాన శాస్త్రాల మంత్రిత్వ శాఖ (ఎంఓఈఎస్) నిర్ణీత కాల ప్రాతిపదికన అంచనా వేస్తుంటుంది. దీని కోసం.. వ్యవసాయం, వైపరీత్యాల వేళ తీసుకొనే చర్యలు, ఈ సమాచారాన్ని వినియోగించుకొంటున్న విమానయానం, మత్స్య పరిశ్రమ, ఇంధనం వంటి రంగాల ప్రతిస్పందనల్నీ, ఫోర్‌కాస్ట్ స్కిల్ స్కోర్లనీ సరిచూడటం, అంచనా ఎంతవరకు ఫలించాయో సమీక్షించడం వంటి మార్గాల్ని మంత్రిత్వ శాఖ అనుసరిస్తుంది. ఈ సమీక్షలు ఐఎండీ, ఇండియన్ ట్రాపికల్ మెటియరాలజీ ఇనిస్టిట్యూట్, మీడియం రేంజ్ వెదర్ ఫోర్‌కాస్టింగ్ నేషనల్ సెంటర్ వంటి సంస్థలు అమలుచేసిన మెరుగైన ముందస్తు అంచనా సామర్థ్యాలు ప్రజలకు ఎంత కీలక ఫలితాలను అందించాయో తెలియజేస్తుంటాయి. ఈ కీలక ఫలితాల్లో.. తుపానులు, వడగాడ్పులు, భారీ వర్షపాతం తదితర తీవ్ర వాతావరణ ఘటనల విషయంలో చక్కని ముందస్తు హెచ్చరికలు చేయడం వంటివి భాగంగా ఉన్నాయి. మెరుగుపరిచిన సమాచారం ప్రజలను సకాలంలో ప్రమాదకర ప్రదేశాల నుంచి సురక్షిత ప్రదేశాలకు తరలించ గలగడానికీ, విపత్తు వేళ తీసుకోవాల్సిన సన్నాహక చర్యల్ని ఇదివరకటి కన్నా మరింత పెంచడానికీ, వ్యవసాయానికి సంబంధించి ఉత్తమ నిర్ణయాల్ని తీసుకోవడానికీ, ప్రాణనష్టాన్నీ, ఆస్తినష్టాన్నీ తగ్గించడానికీ తోడ్పడింది.

దీనికి అదనంగా, మిషన్ మౌసమ్‌ను బహుళ దశలతో కూడిన కార్యక్రమంగా తీర్చిదిద్దారు. మొదటి దశలో వచ్చిన ఫలితాలను ఆధారంగా చేసుకొని తరువాతి దశల్లోనూ ఈ కార్యక్రమాన్ని కొనసాగించడంతో పాటు మరింత విస్తరించాలని ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది. ఈ మిషన్ ద్వారా అమలుచేసే అనేక కార్యక్రమాలు సంక్లిష్ట వాతావరణ ప్రక్రియలను మనం అర్థం చేసుకొనే పద్ధతి మెరుగుపడుతుందని ఆశిస్తున్నారు. ప్రతిపాదించిన రెండో దశలో జాతీయ వాతావరణ పరిశీలక నెట్‌వర్కును మరింత పటిష్ఠపరచడంపై, ఉన్నత పనితీరును ప్రదర్శించే కంప్యూటింగ్ సాయంతో వాతావరణ, శీతోష్ణ స్థితుల గురించి అధిక స్పష్టతను కలిగివుండే నమూనాల్ని అందించడంపై, ముందస్తు అంచనాలు వెలువరించే వ్యవస్థల్లో కృత్రిమ మేధనీ, మెషీన్ లర్నింగ్ సాంకేతికతనీ ఏకీకరించడంపై దృష్టి కేంద్రీకరిస్తారు. ఈ సమాచారాన్ని భూ విజ్ఞాన శాస్త్రాల శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత) డాక్టర్ జితేంద్ర సింగ్ ఈ రోజు లోక్‌సభలో తెలియజేశారు.

# మొల్ల జయంతి సందర్భంగా పోలీసుల ఘన నివాళులు




చిత్తూరు, మార్చి 13: తొలి తెలుగు కవయిత్రి ఆతుకూరి మొల్ల జయంతి సందర్భంగా జిల్లా సాయుధ దళం కార్యాలయంలో ఘనంగా నివాళులు అర్పించారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు ఏ.ఆర్. అడిషనల్ ఎస్పీ దేవదాస్ కవయిత్రి ఆతుకూరి మొల్ల చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ దేవదాస్ మాట్లాడుతూ ఆతుకూరి మొల్ల తెలుగు సాహిత్యంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న గొప్ప కవయిత్రి అని అన్నారు.

రామాయణాన్ని సులభమైన పదాలతో తెలుగులో రచించి సామాన్య ప్రజలకు సైతం అర్థమయ్యేలా అందించడం ఆమె గొప్పతనమని పేర్కొన్నారు. వాల్మీకి మహర్షి రచించిన రామాయణాన్ని తనదైన సరళమైన శైలిలో తెలుగులో అందించడం తెలుగు సాహిత్యానికి గొప్ప సంపదగా నిలిచిందన్నారు. తెలుగులో రామాయణాన్ని రచించిన తొలి కవయిత్రిగా మొల్లమాంబ పేరు ప్రఖ్యాతలు గాంచిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్. డి.ఎస్.పీ మహబూబ్ బాష, ఆర్.ఐ. సుధాకర్, చంద్రశేఖర్‌తో పాటు ఏ.ఆర్. సిబ్బంది పాల్గొని కవయిత్రి ఆతుకూరి మొల్లకు ఘన నివాళులు అర్పించారు.

# జూలూరుపాడులో సివిల్ సప్లై అధికారుల మెరుపు దాడులు

## - 34 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం

ఖమ్మం, మార్చి 13:భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల కేంద్రంలోని హోటళ్లు, కిరాణా దుకాణాలపై సివిల్ సప్లై అధికారులు శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా గ్యాస్ సిలిండర్లను నిల్వ ఉంచి, అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు జిల్లా కలెక్టర్, సివిల్ సప్లై జిల్లా అధికారి ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టారు. ఈ దాడుల్లో మొత్తం 34 అక్రమ గ్యాస్ సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కిరాణా షాపులు, హోటళ్లలో అక్రమంగా దాచిన సిలిండర్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సామాన్యుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని ఎక్కువ రేట్లకు అమ్ముతున్న వారిపై చర్యలు చేపడతామని హెచ్చరించారు.

గ్యాస్ కొరత లేదని, అవసరానికి మించి నిల్వ ఉంచి అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏసీఎస్ఓ వరదరాజులు హెచ్చరించారు. ప్రజలకు సరిపడా గ్యాస్ నిల్వలు అందుబాటులో ఉన్నాయి. ఎవరూ ఆందోళన చెంది అధిక ధరలకు కొనవద్దు. అక్రమంగా నిల్వ చేసే వ్యాపారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ?ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై ఆర్ఐ వెంకటేశ్వర్లు, భద్రాచలం డిప్యూటీ తాసీల్దార్ రాజులు, ఇల్లెందు యుడిఆర్ఐ రాంబాబు, జూలూరుపాడు పోలీసులు పాల్గొన్నారు.







# అక్రమ సంబంధానికి అడ్డు వస్తున్నాడని భర్తను చంపిన భార్య

ఖమ్మం, మార్చి 13: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చండ్రుగొండ మండలం తిప్పనపల్లి గ్రామంలో అక్రమ సంబంధానికి భర్త అడ్డుగా నిలుస్తున్నాడని ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన సంఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగు చూసింది. మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తగూడెం జిల్లా చండ్రుగొండ మండలం తిప్పనపల్లి గ్రామానికి చెందిన సయ్యద్ జాఫర్ కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చింతలపూడి ప్రాంతానికి చెందిన కతిజాతో 12 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు ఆడ, మగ సంతానం కలరు. అన్యోన్యంగా కొనసాగుతున్న వీరు కాపురం లోకి చింతలపూడి ప్రాంతానికి చెందిన ఓ యువకుడు ఖతిజాతో అక్రమ సంబం ధానికి తెర తీశాడు. ప్రియుడు మోజులో పడిన ఖతిజా తన భర్త మద్యానికి బానిస అయ్యాడని ప్రచారాన్ని చేస్తూ ప్రియుడితో అక్రమ సంబంధాన్ని కొనసాగి స్తుంది. ఈ క్రమంలో భర్త తరచూ నిలదీస్తుండడంతో ఎలా గైనా అడ్డు తొలగించుకోవాలని ప్రియుడితో కలిసి పథకం పన్నింది.

# కవయిత్రి మొల్ల ఆదర్శప్రాయురాలు..

## -జిల్లా రెవెన్యూ అధికారి మోహన్ కుమార్

చిత్తూరు, మార్చి 13: సమాజంలో మహిళలు చదువుకు దూరంగా ఉన్న కాలంలోనే తన అసాధారణ సాహిత్య ప్రతిభతో మొల్ల రామాయణం రచించిన భక్త కవయిత్రి ఆతుకూరి మొల్ల నేటి తరానికి ఆదర్శప్రాయురాలని జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్ పేర్కొన్నారు. శనివారం చిత్తూరులోని జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆతుకూరి మొల్ల జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కవయిత్రి మొల్ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడిన ఆయన, కుమ్మరి కుటుంబంలో జన్మించిన మొల్ల ఎటువంటి రాజపోషణ లేకుండానే భగవంతునిపై ఉన్న భక్తితో సరళమైన తెలుగులో రామాయణాన్ని రచించి తెలుగు సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు.



16వ శతాబ్దానికి చెందిన కవయిత్రిగా మొల్లకు తెలుగు సాహిత్యంలో ప్రత్యేక స్థానం ఉందన్నారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా తమలోని సృజనాత్మకతను వెలికితీయాలని చెప్పడానికి మొల్ల జీవితం ఒక గొప్ప ఉదాహరణ అని ఆయన పేర్కొన్నారు. మొల్ల రామాయణంలోని పద్యాలు నేటికీ పండిత పామరులను అలరిస్తున్నాయని, అటువంటి గొప్ప కవయిత్రి జయంతిని ప్రభుత్వ పరంగా నిర్వహించడం గర్వకారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు అట్లూరి శ్రీనివాసులు, బీసీ నాయకుడు షణ్ముగం, బీసీ సంక్షేమ అధికారి రబ్బానీ భాష, రాయలసీమ కుమ్మరి యూత్ కార్యదర్శి హరిప్రసాద్, హరిబాబు, చలపతి, సోమశేఖర్, బీసీ సంఘాల నాయకులు, వివిధ శాఖల అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# ఎటువంటి బొగ్గు డిమాండ్‌నైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్న భారత్

న్యూఢిల్లీ, మార్చి 13:ఈ ఏడాది బొగ్గు వినియోగం కంటే ఎక్కువగా ఉత్పత్తి, సరఫరా ఉంది. దీని ఫలితంగా థర్మల్ విద్యుతుత్పత్తి కేంద్రాలు, బొగ్గు గనుల వద్ద రికార్డు స్థాయిలో నిల్వలు పెరిగాయి. అంతేకాకుండా అనియంత్రణ రంగానికి సరఫరా గత ఏడాదితో పోలిస్తే దాదాపు 14 శాతం పెరిగింది.

2025 ఏప్రిల్ 1 నాటికి కోల్ ఇండియా (సీఐఎల్) గనుల వద్ద 106.78 ఎంటీ (మిలియన్ టన్నుల) బొగ్గు నిల్వలు ఉండగా 2026 మార్చి 9 నాటికి అవి 121.39 ఎంటీలకు పెరిగాయి. దీనికి అదనంగా సింగరేణి (ఎన్‌సీసీఎల్) గనుల వద్ద సుమారు 6.07 ఎంటీలు, క్యాప్టివ్ లేదా వాణిజ్య గనుల వద్ద 15.12 ఎంటీలు, రవాణాలో సుమారు 14 ఎంటీల బొగ్గు అందుబాటులో ఉంది. దీంతో గనుల వద్ద ఉన్న మొత్తం బొగ్గు నిల్వలు మొదటిసారిగా 156.58 మిలియన్ టన్నుల అత్యధిక స్థాయికి చేరాయి. ఈ నిల్వలు విద్యుతుత్పత్తి కేంద్రాల వద్ద ఇప్పటికే ఉన్న 54.05 ఎంటీల బొగ్గుకు అదనం. ప్రస్తుతం దేశంలో ఉన్న బొగ్గు వినియోగం రేటు ప్రకారం విద్యుతుత్పత్తి కేంద్రాల వద్ద ఉన్న ఈ నిల్వలు సుమారు 24 రోజుల అవసరాలకు సరిపోతాయి.

దేశంలో అందుబాటులో ఉన్న మొత్తం బొగ్గు నిల్వలు సుమారు 210 మిలియన్ టన్నులు. ఈ నిల్వలు దాదాపు 88 రోజుల అవసరాలకు సరిపోతాయి.

రైల్వే శాఖ సహకారంతో వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా తగినంత సరఫరాను అందించడానికి దేశంలో బొగ్గు ఉత్పత్తి ఇదే వేగంతో కొనసాగుతోంది. తద్వారా గనుల వద్ద నిల్వలు నిరంతరం పెరుగుతున్నాయి.

నిరంతర విధానపరమైన మద్దతు, పనితీరును నిశితంగా పర్యవేక్షించటం, సంబంధిత భాగస్వాములతో సమన్వయం ద్వారా స్థిరమైన, పనితీరు ఆధారిత వాతావరణాన్ని సృష్టించడంపై బొగ్గు మంత్రిత్వ శాఖ దృష్టి సారించింది. విశ్వసనీయమైన బొగ్గు లభ్యతను నిర్ధారించడం, కీలక రంగాల్లో నిరంతర కార్యకలాపాలకు మద్దతు ఇవ్వడం, దేశంలో పెరుగుతున్న ఇంధన అవసరాలను తీర్చడమే దీని లక్ష్యం. తద్వారా 'వికసిత్ భారత్ 2047' నిర్మించాలనే సుదీర్ఘ జాతీయ లక్ష్యానికి బొగ్గు మంత్రిత్వ శాఖ తన వంతు సహకారాన్ని అందిస్తోంది.

# ముంబైలో జరిగిన 'అమ్యూజ్‌మెంట్ ఎక్స్‌పో 2026'లో దేశంలో తయారైన ఎక్స్ ఆర్ ఆవిష్కరణలను ప్రదర్శించిన సీఐసీ విజేత

న్యూఢిల్లీ, మార్చి 13:వేవ్స్ ఆధ్వర్యంలో సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ చేపట్టిన 'క్రియేట్ ఇన్ ఇండియా' ఛాలెంజ్ (సీఐసీ) సీజన్ 1 కింద ఎక్స్ ఆర్ క్రియేటర్ హ్యాకథాన్‌లో విజేతగా నిలిచిన అంకుర సంస్థల్లో ఒకటి'యూత్ బజ్'.. ప్రస్తుతం ఈ స్టార్టప్ మహారాష్ట్రలోని ముంబైలోని గోరేగావ్‌లోని బాంబే ప్రదర్శన శాలలో 2026 మార్చి 10 నుంచి 12 వరకు జరుగుతున్న అమ్యూజ్‌మెంట్ ఎక్స్‌పోలో తన వినూత్నమైన ఎక్స్ ఆర్ పరిష్కారాలను ప్రదర్శిస్తోంది.

వేవెక్స్ స్టార్టప్ యాక్సిలరేటర్ కార్యక్రమం కింద కూడా ఇంక్యుబేట్ అయిన ఈ 'యూత్ బజ్' అంకుర సంస్థ..'ఇమ్మర్సివ్ వార్‌ఫేర్', 'మెటా ద్వార్'వంటి వినూత్న గేమ్‌లతో సహా గేమింగ్ రంగంలో పూర్తి స్వదేశీ సాంకేతికతతో పలు రకాలుగా లీనమయ్యే వినోద అనుభవాలను అందిస్తోంది. రేసింగ్, ఫ్లయింగ్ అనుభూతిని కలిగించే అత్యాధునిక సిమ్యులేటర్లను కూడా ప్రదర్శిస్తోంది. ఇది ఆర్‌సీ క్లౌడ్ అరీనా అనే క్లౌడ్-కనెక్టెడ్ రిమోట్-కంట్రోల్డ్ గేమింగ్ వేదిక. దీని ద్వారా ఆటగాళ్లు ఇంటర్నెట్ సహాయంతో వాస్తవ ప్రపంచంలోని రిమోట్ కంట్రోల్ పరికరాలను నియంత్రించగలుగుతారు.

వినోద ప్రదర్శనలో వారి భాగస్వామ్యం, సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ చేపట్టిన 'క్రియేట్ ఇన్ ఇండియా ఛాలెంజ్' ద్వారా ఎంపికైన విజేతల సామర్థ్యాన్ని తెలియజేస్తుంది. మీడియా, వినోద రంగంలో ముఖ్యంగా ఏవీజీసీ-ఎక్స్‌ఆర్ పరిశ్రమల్లో వినూత్న సృష్టికర్తలను గుర్తించడానికి, వారికి మద్దతు ఇవ్వడానికి మంత్రిత్వ శాఖ నిరంతరం కృషి చేస్తోంది.

క్రియేట్ ఇన్ ఇండియా ఛాలెంజ్ వివరాలు...

'క్రియేట్ ఇన్ ఇండియా ఛాలెంజ్' అనేది మీడియా, వినోద రంగంలోని వివిధ పరిశ్రమల సంఘాల ద్వారా నిర్వహించే వేవ్స్ విభాగాలలో ఒకటి. ఇది పరిశ్రమల నేతృత్వంలో ప్రభుత్వ మద్దతుతో నడిచే యువత ఆధారిత వేదిక. యానిమేషన్, వీఎఫ్ఎక్స్, గేమింగ్, కామిక్స్, ఎక్స్ ఆర్ (ఏవీజీసీ-ఎక్స్ ఆర్), సంగీతం, సినిమాలు, డిజిటల్ మీడియా వంటి వివిధ విభాగాలలో ప్రతిభను గుర్తించడం, ప్రోత్సహించడం, శిక్షణ ఇవ్వడం, సృజనాత్మక నైపుణ్యాన్ని ప్రదర్శించడం దీని ముఖ్య ఉద్దేశం. సంబంధిత పరిశ్రమల సంఘాలు రూపొందించిన సవాళ్ల ద్వారా భవిష్యత్తు అవసరాలకు తగినట్లుగా ప్రతిభావంతులైన యువతను సిద్ధం చేయడంపై సీఐసీ దృష్టి సారిస్తుంది. ఇది మార్కెట్ అవకాశాలను, పరిశ్రమకు అవసరమైన ప్రత్యేక నైపుణ్యాలను సృష్టికర్తలకు అందిస్తుంది.

# విద్యార్థులు కష్టపడి చదవాలి : ఎమ్మెల్యే బాలు నాయక్

## -చందంపేట కేజీబీవీలో అదనపు తరగతి గదులు ప్రారంభం

నల్గొండ, మార్చి 13: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు కష్టపడి చదివి మంచి భవిష్యత్ పొందాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. శుక్రవారం చందంపేట, మురుపునతుల, బంధమిద్ తండా, మానవత్ తండాలో పలు అభివృద్ధి కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీలో రూ.85 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులను ఆయన ప్రారంభించారు. అదే విధంగా అయా గ్రామాల్లో సంఘం భవనం, సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అధిక నిధులు కేటాయించి అన్ని విధాలుగా మౌలిక సదుపాయాలు కలిపిస్తూ అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు నిర్లక్ష్యం వహించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ఏడీఏ బాలు, ఎంపీడీఓ లక్ష్మి, ఎంఈఓ లింగమయ్య, సర్పంచులు సాదిక్, మన్మథరెడ్డి, కవిత రవి, వెంకటయ్య, బిక్కు నాయక్, కృష్ణ, గోవింద్ యాదవ్, హరికృష్ణ, బాధ్యనాయక్, గిరి, మల్లారెడ్డి, రంగయ్య, మకట్ లాల్, నాగేశ్వర్ నాయక్, రాజు, జ్యోతి పాల్గొన్నారు.

# కాకర్ల పాలగుట్టపై వైభవంగా 'వేణుగోపాల స్వామి' బ్రహ్మోత్సవాలు



ఖమ్మం, మార్చి 13:భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల పరిధిలోని కాకర్ల గ్రామ సమీపంలో ఉన్న పాలగుట్టపై స్వయంభూగా వెలసిన శ్రీ రుక్మిణి సహిత సంతాన వేణుగోపాల స్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం అత్యంత వైభవంగా కన్నుల పండువగా భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ప్రకృతి ఒడిలో స్వయంభువుగా వెలసిన ఈ క్షేత్రంలో గోపాలుడి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. ఈ సందర్భంగా ఆలయంలో శాస్త్రోక్తంగా హోమాలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం తెల్లవారుజాము నుంచే ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఉదయం యాగశాలలో చతుస్థానార్చనలు, నిత్యపూర్ణాహుతి కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేద మంత్రోచ్ఛారణల మధ్య జరిగిన ఈ హోమ క్రతువులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

అనంతరం నేత్రపర్వంగా శ్రీవారి కల్యాణం ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన శ్రీ రుక్మిణి సహిత సంతాన వేణుగోపాల స్వామి వారి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా సాగింది. మంగళ వాయిద్యాలు, భక్తజన జయజయధ్వానాల మధ్య స్వామివారి కల్యాణాన్ని అర్చకులు వేదోక్తంగా జరిపించారు. ఈ వేడుకను వీక్షించేందుకు పరిసర గ్రామాల నుంచే కాకుండా జిల్లా నలుమూలల నుండి భక్తులు భారీగా తరలివచ్చారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు ఆలయ కమిటీ వారు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 12:00 గంటల నుండి భక్తులందరికీ భారీ స్థాయిలో అన్న సమారాధన నిర్వహించారు.

ఆలయ కమిటీ చైర్మన్, శ్రీకృష్ణ సేవా సమితి సభ్యులు, గ్రామస్తులు సమన్వయంతో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించారు. పాలగుట్టపై వెలసిన స్వామివారిని దర్శించుకుంటే సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ వార్షిక బ్రహ్మోత్సవాలతో కాకర్ల గ్రామం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఢిల్లి వెంకటేశ్వర్లు, శ్రీకృష్ణ సేవా సమితి సభ్యులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

# జిల్లాలో గ్యాస్ సరఫరాపై అపోహలు వద్దు: కలెక్టర్ ప్రావీణ్య.

-గ్యాస్ సిలిండర్ల కొరత లేదు .

-బ్లాక్ మార్కెటింగ్‌పై కఠిన చర్యలు



సంగారెడ్డి, మార్చి 13(నేటి నిజం ప్రతినిధి)జిల్లాలో గృహ అవసరాల కోసం వినియోగించే ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య స్పష్టం చేశారు. గ్యాస్ సరఫరాపై సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని, ఎలాంటి భయాందోళనలకు గురి కావాల్సిన అవసరం లేదని ఆమె తెలిపారు.

శుక్రవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించి జిల్లాలో గ్యాస్ సరఫరా పరిస్థితిపై సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గృహ వినియోగదారులతో పాటు ఆసుపత్రులు, విద్యాసంస్థలు, ప్రభుత్వ సంస్థలు, వసతి గృహాలు, అంగన్వాడి కేంద్రాలు, వృద్ధాశ్రమాలకు ప్రాధాన్యత క్రమంలో గ్యాస్ సరఫరా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్యాస్ కొరత పేరుతో నిల్వలు దాచడం, అక్రమంగా మళ్లించడం లేదా బ్లాక్ మార్కెటింగ్ చేయడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గ్యాస్ వినియోగదారులు అవసరానికి మించి సిలిండర్లు బుక్ చేయకుండా నిబంధనలను పాటించాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో 25 రోజులకు ఒకసారి, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులకు ఒకసారి మాత్రమే గ్యాస్ బుకింగ్ చేసుకోవాలని తెలిపారు. కమర్షియల్ అవసరాలకు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వినియోగించరాదని, అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రతిరోజూ గ్యాస్ బుకింగ్‌లు, సరఫరా వివరాలను సేకరించి పూర్తి పర్యవేక్షణ చేయాలని తెలిపారు.

జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్లకు ఏదైనా సమస్య ఎదురైతే స్థానిక ఎస్‌హెచ్‌ఓ లేదా 100 నంబర్‌కు వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎక్కడైనా గ్యాస్ సిలిండర్ల బ్లాక్ మార్కెటింగ్ జరుగుతున్నట్లు తేలితే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి బాలసరోజ, సహాయ పౌర సరఫరాల అధికారి రాజేశ్వర్, సంక్షేమ శాఖల అధికారులు అఖిలేష్ రెడ్డి, జగదీష్, రాజేశ్వర్ అంబదాస్, లలిత కుమారి, డీఈఓ వెంకటేశ్వర్లు, ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మురళీధర్ రెడ్డి, సభ్యులు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# చారిత్రాత్మక గ్లోబల్ ఏఐ సదస్సు - కృత్రిమ మేధ ఆవిష్కరణలు, పాలన, భాగస్వామ్యాలు, సమ్మిళిత వృద్ధికి ప్రపంచ కేంద్రంగా సుస్థిర స్థానాన్ని సాధించిన భారత్

న్యూఢిల్లీ, మార్చి 13:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికతకు అనుగుణంగా, ప్రభుత్వం సాంకేతికత అభివృద్ధిని వినియోగాన్ని ప్రజాస్వామ్యీకరిస్తోంది. వాస్తవ ప్రపంచ సమస్యలను పరిష్కరించడానికి, వివిధ రంగాలలో జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి కృత్రిమ మేధను ఉపయోగించడంపై ప్రధానంగా దృష్టి సారించింది. దీని ప్రాముఖ్యతను గుర్తిస్తూ, బాధ్యతాయుతంగా, సమ్మిళితంగా కృత్రిమ మేధ వినియోగాన్ని ప్రోత్సహించడానికి భారత ప్రభుత్వం అంతర్జాతీయ భాగస్వాములు, పరిశ్రమలు, విద్యాసంస్థలు, రాష్ట్రాలతో కలిసి పనిచేస్తోంది.

న్యూఢిల్లీలోని భారత్ మండపంలో 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్'ను 2026 ఫిబ్రవరి 16-21 తేదీలలో భారత్ నిర్వహించింది. గ్లోబల్ ఏఐ సదస్సు గ్లోబల్ సౌత్ (అభివృద్ధి చెందుతున్న దేశాల కూటమి)లో జరగడం ఇదే మొదటిసారి. ఇది మరింత సమగ్రమైన ప్రపంచ ఏఐ చర్చల దిశగా జరుగుతున్న విస్తృత పరిణామాన్ని సూచిస్తుంది.

ఈ సదస్సు ఒక చారిత్రాత్మక ప్రపంచ సమ్మేళనంగా ముగిసింది, ఇది కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఆధారిత ఆవిష్కరణలు, పాలన, భాగస్వామ్యం, సమ్మిళిత వృద్ధికి ప్రపంచ కేంద్రంగా భారత్ స్థానాన్ని సుస్థిరం చేసింది. ఐదు రోజుల పాటు జరిగిన ఈ భారీ సదస్సు ఒక అభివృద్ధి చెందుతున్న దేశం నిర్వహించిన అతిపెద్ద సదస్సు గా నిలిచింది. ఇది "సర్వజన హితాయ, సర్వజన సుఖాయ" (అందరి సంక్షేమం, అందరి సంతోషం) అనే ఇతివృత్తంతో ప్రభుత్వాలు, పరిశ్రమలు, విద్యాసంస్థలు, పౌర సమాజం, స్టార్టప్‌ల నాయకులను ఒక వేదికపై చేర్చింది.

# లోక్‌సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లాపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై జరిగిన చర్చకు సమాధానమిచ్చిన కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా

న్యూఢిల్లీ, మార్చి 13:లోక్‌సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లాపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై లోక్‌సభలో జరిగిన చర్చలో కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా సమాధానమిచ్చారు. చర్చ అనంతరం అవిశ్వాస తీర్మానాన్ని మూజువాణి ఓటుతో లోక్‌సభ తిరస్కరించింది. ఇది సాధారణ విషయం కాదని, దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత లోక్‌సభ స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం సభలో ప్రవేశపెట్టినట్లు కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి తెలిపారు. పార్లమెంటు రాజకీయాలు, సభకు ఇది దురదృష్టకరమైన సందర్భమన్నారు. లోక్‌సభ స్పీకర్ ఏ పార్టీకి చెందిన వారు కాదని, మొత్తం సభకు ప్రాతినిధ్యం వహిస్తారని, సభలోని సభ్యులందరి హక్కులను ఆయనే కాపాడతారని శ్రీ అమిత్ షా తెలిపారు. స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టటం సాహసవంతమైన చర్య కాదని ఆయన అన్నారు.

ఆ అంశంపై అధికార ప్రభుత్వ, ప్రతిపక్షాలు కలిసి దాదాపు 13 గంటల పాటు చర్చించాయని, ఈ చర్చలో 42 మందికి పైగా ఎంపీలు పాల్గొన్నట్లు శ్రీ అమిత్ షా వెల్లడించారు. స్పీకర్ నిర్ణయమే అంతిమం అని ఎన్నో ఏళ్లుగా ఉన్న సంప్రదాయానికి విరుద్ధంగా ఇవాళ ప్రతిపక్షాలు స్పీకర్ చిత్తశుద్ధిని ప్రశ్నిస్తున్నాయన్నారు. భారతదేశంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వేదికైన లోక్‌సభ.. కేవలం దేశవ్యాప్తంగానే కాక, ప్రపంచవ్యాప్తంగా విశ్వసనీయతను చాటుకుందని తెలిపారు. భారత ప్రజాస్వామ్య పటిష్ఠతను అంతర్జాతీయ సమాజం సైతం గుర్తిస్తుందన్నారు. లోక్‌సభ అధిపతి నిబద్ధతను ప్రశ్నించినప్పుడు.. దేశంలోనే కాక, ప్రపంచవ్యాప్తంగా మన ప్రజాస్వామ్య విధానాలపై అనుమానం కలుగుతుందన్నారు.

ప్రతిపక్ష సభ్యులు లోక్‌సభ స్పీకర్ ఛాంబర్‌కు వెళ్లి గందరగోళం సృష్టించటం ఆయన భద్రతపై ఆందోళన కలిగిస్తోందని శ్రీ అమిత్ షా పేర్కొన్నారు. రాజ్యాంగం స్పీకర్ పదవిని పార్టీలకతీతంగా ఉంచిందని, ఆయనకు ఒక తటస్థ మధ్యవర్తి పాత్రను అప్పగించిందన్నారు. ఈ మధ్యవర్తిత్వ బాధ్యతను నిర్వహిస్తున్న వారిపై ప్రతిపక్షాలు సందేహాలు వ్యక్తం చేస్తున్నాయి. గడిచిన 75 ఏళ్లుగా పార్లమెంటు ఉభయసభలు భారత ప్రజాస్వామ్య పునాదులను బలోపేతం చేశాయని, అయితే విపక్షాలు ఇప్పుడు ఆ విశ్వసనీయతపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయన్నారు. పరస్పర విశ్వాసంతో సభా కార్యకలాపాలు నడుస్తాయని, అధికార పక్షానికి, ప్రతిపక్షానికి సంరక్షకుడిగా స్పీకర్ ఉంటారని శ్రీ అమిత్ షా పేర్కొన్నారు. లోక్‌సభ కార్యకలాపాల నిర్వహణకు, స్పీకర్ సభను ఏ విధంగా నడపాలో తెలియజేసేలా కొన్ని నియమాలను లోక్‌సభ రూపొందించిందని ఆయన వెల్లడించారు. ఉత్సవం లేదా క్రమపద్ధతి లేకుండా గుమికూడే ప్రదేశం సభ కాదని ఆయన స్పష్టం చేశారు. సభ నిబంధనలు అనుమతించనప్పుడు, ఆ నిబంధనలకు వ్యతిరేకంగా మాట్లాడే హక్కు ఎవరికీ లేదు. లోక్‌సభ పనితీరును నియంత్రించే నిబంధనలను ఉల్లంఘించినప్పుడు జోక్యం చేసుకుని అలాంటి ప్రవర్తనను అదుపు చేయడం స్పీకర్ బాధ్యత అని శ్రీ అమిత్ షా స్పష్టం చేశారు. దేశంలో తొలి ప్రధానమంత్రి కాలం నుంచే ఈ నిబంధనలు అమల్లో ఉన్నాయని, అయితే ప్రధాన ప్రతిపక్షం పలు సందర్భాల్లో వీటిని ఉల్లంఘించిందని పేర్కొన్నారు. స్పీకర్ నిర్ణయాలను, సమగ్రతను ప్రశ్నించకూడదని, అలా చేయడం అత్యంత దురదృష్టకరమని, ఖండించదగిన విషయమని శ్రీ అమిత్ షా అన్నారు.

తమ పార్టీ కూడా ప్రతిపక్షంలో ఉందని, ఆ సమయంలో స్పీకర్‌పై మూడుసార్లు అవిశ్వాస తీర్మానం పెట్టారని శ్రీ అమిత్ షా పేర్కొన్నారు. అయితే, తమ పార్టీ లేదా కూటమి గానీ ఎప్పుడూ స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టలేదని స్పష్టం చేశారు. తాము ఎల్లప్పుడూ నిర్మాణాత్మక ప్రతిపక్షంగా ఉంటూ, స్పీకర్ పదవికి గౌరవమిచ్చామని, రాజ్యాంగపరమైన హక్కులను స్పీకర్ ద్వారానే డిమాండ్ చేశామని ఆయన పేర్కొన్నారు. స్పీకర్‌పై ఎన్నడూ అవిశ్వాస తీర్మానం తీసుకురాలేదని శ్రీ అమిత్ షా మరోసారి స్పష్టం చేశారు.

1954లో జీ.వీ. మావ్లంకర్‌పై సోషలిస్ట్ పార్టీ అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టిందని శ్రీ అమిత్ షా తెలిపారు. 1966లో అప్పటి లోక్‌సభ స్పీకర్ సర్దార్ హుకం సింగ్‌పై సంయుక్త సోషలిస్ట్ పార్టీ, 1987లో బలరాం జఖర్‌పై సీపీఐ అవిశ్వాస తీర్మానాలను ప్రవేశపెట్టాయి. దాదాపు ఆ పార్టీలన్నీ ఇప్పుడు ప్రతిపక్ష కూటమిలోనే ఉన్నాయని పేర్కొన్నారు. స్పీకర్ సమగ్రతను ఎప్పుడూ ప్రశ్నించకూడదని తమ పార్టీ బలంగా నమ్ముతుందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. స్పీకర్ ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకుంటారని, శాసన న్యాయ శాస్త్రంలో లోక్‌సభ స్పీకర్ అత్యున్నత న్యాయనిర్ణేత అని శ్రీ అమిత్ షా అన్నారు. లోక్‌సభ కార్యకలాపాల సందర్భంగా తీసుకునే నిర్ణయాల్లో సుప్రీంకోర్టు కూడా జోక్యం చేసుకోలేదని, రాజ్యాంగమే స్పీకర్‌కు ఆ రక్షణ కల్పించిందని ఆయన వివరించారు. నిర్భయంగా విధులను నిర్వహించేందుకు స్పీకర్‌కు ఈ రక్షణ కల్పించారు. సభ క్రమశిక్షణ, హుందాతనాన్ని కాపాడటం స్పీకర్ మొదటి బాధ్యత అని, సభ్యులందరికీ సమాన అవకాశం కల్పించి, నిష్పక్షపాతంగా సభను నడిపించటం రెండో బాధ్యతని శ్రీ అమిత్ షా వివరించారు. సభ కార్యకలాపాల కోసం రూపొందించిన నిబంధనల ప్రకారం లోక్‌సభ వ్యవహరించటం పార్లమెంటరీ మర్యాద అని స్పష్టం చేశారు.

లోక్‌సభ నిబంధన 374 ప్రకారం.. సభలో గందరగోళం సృష్టించి, క్రమశిక్షణ లేకుండా వ్యవహరించిన సమయాల్లో సభ్యులను హెచ్చరించేందుకు, వారి పేర్లను ప్రకటించేందుకు, బహిష్కరించేందుకు, సస్పెండ్ చేసేందుకు స్పీకర్‌కు అధికారం ఉంటుందని కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా పేర్కొన్నారు. సభలో నిరసన తెలపాలనుకునేవారు లేదా క్రియాశీలకంగా వ్యవహరించాలనుకునే వారు తప్పనిసరిగా సభ నిబంధనలకు అనుగుణంగానే నడుచుకోవాలని ఆయన స్పష్టం చేశారు. నిబంధన 375 ప్రకారం.. సభలో గందరగోళం నెలకొన్నప్పుడు, సభను వాయిదా వేయాల్సి ఉంటుందని శ్రీ అమిత్ షా పేర్కొన్నారు. సభా నిబంధన 380 ప్రకారం.. అన్-పార్లమెంటరీ పదాలను, వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించే అధికారం స్పీకర్‌కు ఉంటుందని ఆయన వివరించారు. ఒక నిర్దిష్టమైన ధోరణిలో లేదా సందర్భంలో చేసిన అనుచిత వ్యాఖ్యలను పార్లమెంటు చరిత్రలో భద్రపరచకూడదని, అలా చేస్తే పార్లమెంటు సభ్యులు భవిష్యత్తులోనూ అదే తీరును అనుసరించే ప్రమాదం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. సభ ఏర్పడినప్పటి నుంచి ఈ పదవిని చేపట్టిన ఎందరో మహానుభావులు కాలక్రమేణా అన్-పార్లమెంటరీ పదాల జాబితాను రూపొందించారని, అది అందరికీ వర్తిస్తుందని శ్రీ అమిత్ షా తెలిపారు. ప్రతిపక్షాలకు రాజ్యాంగం కొన్ని హక్కులను కల్పించిందని, ఎలాంటి ప్రత్యేకాధికారాలను ఇవ్వలేదన్నారు. హక్కులను కాపాడుకోవాలి కానీ, ప్రత్యేకాధికారాలు ఉన్నాయనే భ్రమలో ఉన్నవారికి పార్టీ నుంచి గానీ, ప్రజల నుంచి కానీ ఎలాంటి రక్షణా ఉండదన్నారు.

లోక్‌సభ స్పీకర్ ప్రాముఖ్యత కేవలం సభకు మాత్రమే పరిమితమైనది కాదని.. దేశానికి, అంతర్జాతీయ స్థాయికి కూడా విస్తరిస్తుందని శ్రీ అమిత్ షా పేర్కొన్నారు. స్పీకర్ కేవలం సభను నడిపించే అధికారి మాత్రమే కాదని.. శాసనసభ చైతన్యానికి, ప్రజాస్వామ్య గౌరవానికి చిహ్నమని తెలిపారు. ఒక వ్యక్తి స్పీకర్ చిత్తశుద్ధిని ప్రశ్నించటమంటే.. అది మన శాసనసభల విచక్షణను, ప్రజాస్వామ్య గౌరవాన్నే ప్రశ్నించినట్లని చెప్పారు. ప్రధానమంత్రిని తొలగించే తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టవచ్చని, లోక్‌సభ స్పీకర్‌ను తొలగించే ప్రతిపాదనను తీసుకురావటాన్ని సాహసమైన చర్యగా భావించకూడదని శ్రీ అమిత్ షా అన్నారు. అత్యంత కఠినమైన పరిస్థితులను ఊహించి ఈ నిబంధనలను రాజ్యాంగం రూపొందించిందని ఆయన తెలిపారు. స్పీకర్‌ను తొలగించే నిబంధన కేవలం అసాధారణ పరిస్థితుల కోసమే తప్ప, సాధారణ విషయంగా పరిగణించబడకూడదని స్పష్టం చేశారు.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 96 ప్రకారం.. స్పీకర్‌ను పదవి నుంచి తొలగించాలనే తీర్మానం పరిశీలనలో ఉన్నప్పుడు సంబంధిత ప్రిసైడింగ్ అధికారి సభకు అధ్యక్షత వహించకూడదని చెప్పారు. ప్రధాన ప్రతిపక్షం అధికారంలో ఉన్న సమయంలో మూడుసార్లు అవిశ్వాస తీర్మానాలు వచ్చాయని, ఆ సందర్భాల్లోనూ.. స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం చర్చకు వచ్చినప్పుడు అధ్యక్ష పీఠంపై స్పీకర్ కూర్చోకపోవటమే సంప్రదాయంగా వస్తోందని ఆయన వివరించారు. ఆ మూడు సందర్భాల్లోనూ స్పీకర్లు 14 రోజుల పాటు పదవిలో కొనసాగారు. నైతిక విలువల ప్రాతిపదికన, సభా కార్యకలాపాలను పర్యవేక్షించకూడదని నిర్ణయించుకున్న ఏకైక స్పీకర్ శ్రీ ఓం బిర్లా మాత్రమేనని ఆయన తెలిపారు. నిబంధన 94-సి ప్రకారం.. అత్యంత అసాధారణమైన, తీవ్రమైన పరిస్థితుల్లో మాత్రమే లోక్‌సభ స్పీకర్‌ను పదవి నుంచి తొలగించవచ్చని ఆయన తెలిపారు. ప్రధానమంత్రిని తొలగించటానికి కేవలం సాధారణ మెజారిటీ సరిపోతుందని, కానీ స్పీకర్‌ను తొలగించటానికి అసాధారణ మెజారిటీ అవసరమని శ్రీ అమిత్ షా వివరించారు.

ఏ ఒక్క రాజకీయ పార్టీ నిబంధనల ప్రకారం సభ సాగదని.. కేవలం లోక్‌సభ నిబంధనల ప్రకారమే నడుస్తుందని కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా పేర్కొన్నారు. విపక్షాలు తరచుగా నైతిక విలువల గురించి మాట్లాడుతుంటాయని, అయితే లోక్‌సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా విపక్షాలకిచ్చిన అవకాశమే నిజమైన నైతికతకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. అవిశ్వాస తీర్మానం నోటీసు రెండుసార్లు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నప్పటికీ, దాన్ని సరిదిద్దుకునేందుకు స్పీకర్ అవకాశమిచ్చారని శ్రీ అమిత్ షా చెప్పారు. ప్రతిపక్షాలు నిబంధనలను పాటించవని, పైగా మాట్లాడనివ్వటం లేదని ఆరోపణలు చేస్తాయని ఆయన పేర్కొన్నారు. నియమావళిని అనుసరిస్తూ, బిజినెస్ అడ్వైజరీ కమిటీ అంగీకారంతో ఒక ప్రతిపాదనను సభ ముందుకు తెచ్చినప్పుడు దానిపై చర్చించకుండా సభా కార్యక్రమాలకు ప్రతిపక్షాలు ఆటంకం కలిగించాయని శ్రీ అమిత్ షా అన్నారు. దీనికంటే సిగ్గుపడాల్సిన ఘటన మరొకటి ఉండదని వ్యాఖ్యానించారు. చర్చల సందర్భంగా ప్రతిపక్ష నేతలు చేసిన ప్రసంగాల్లో 80 శాతానికి పైగా అంశాలు అవిశ్వాస తీర్మానానికి సంబంధించినవే కావని ఆయన స్పష్టం చేశారు.

లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్ పదవిని భర్తీ చేయలేదని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయని శ్రీ అమిత్ షా పేర్కొన్నారు. 1966లోనూ, ఆ తర్వాత ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాల సమయంలో బలరాం జాఖడ్ లోక్‌సభ స్పీకర్‌గా ఉన్నారు. ఆ రెండు సందర్భాల్లోనూ డిప్యూటీ స్పీకర్ పదవిలో మరొకరు కొనసాగుతున్నారు. కానీ, అప్పటి అధికార పార్టీ తమ పార్టీకి చెందిన వారిని డిప్యూటీ స్పీకర్‌గా నియమించింది. అధికారంలో ఉన్నప్పుడు నిబంధనలను తమకు అనుకూలంగా మార్చుకున్న ప్రతిపక్షాలకు.. ఇప్పుడు డిప్యూటీ స్పీకర్ పదవి ఖాళీగా ఉండటంపై అభ్యంతరం వ్యక్తం చేసే హక్కు లేదని స్పష్టం చేశారు.

ఇక 16వ లోక్‌సభ 331, 17వ లోక్‌సభ 274, ప్రస్తుత లోక్‌సభ (2025 వరకూ) 103 వంతున సమావేశాల వంతున నిర్వహించినట్లు శ్రీ అమిత్ షా వివరించారు. అలాగే, 2025 బడ్జెట్ సమావేశాల ఉత్పాదకత 118 శాతం కాగా, 16, 17, 18వ లోక్‌సభలు 91 శాతం వంతున ఉత్పాదకతను నమోదు చేశాయని పేర్కొన్నారు. మొత్తం మీద ప్రస్తుత స్పీకర్ శ్రీ ఓం బిర్లా పదవీకాలంలో అత్యధిక ఉత్పాదకత సాధించినట్లు తెలిపారు. జీరో అవర్ వ్యవధిని స్పీకర్ 5 గంటలకు పొడిగించారని ఆయన గుర్తుచేశారు. అర్ధరాత్రి దాకా జీరో అవర్ సమస్యలను సభ్యులు ప్రస్తావించేందుకు అనుమతిచ్చిన ఇటువంటి స్పీకర్‌ను ఎమ్మెల్యేగా, ఎంపీగా తన 30 ఏళ్ల పదవీ కాలంలో ఎన్నడూ చూడలేదన్నారు. మొత్తం 202 మంది సభ్యులకు ప్రశ్నలు వేసే అవకాశం ఇచ్చినా, తమకు అనుమతి లభించడంలేదని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయన్నారు.

లోక్‌సభలో కొత్త సభ్యులను ప్రోత్సహించడం స్పీకర్ నైతిక బాధ్యతని శ్రీ అమిత్ షా గుర్తుచేశారు. ఈ మేరకు 2019లో రికార్డు స్థాయిలో 78 మంది మహిళలు లోక్‌సభకు ఎన్నిక కాగా, వారందరికీ మాట్లాడే అవకాశం కల్పించేలా స్పీకర్ శ్రద్ధ చూపారని పేర్కొన్నారు. శ్రీ ఓం బిర్లా కృషి ఫలితంగానే సభలో ప్రాంతీయ భాషల వినియోగం పెరిగిందని, ఇదొక ముఖ్యమైన విజయమని చెప్పారు. సభలో అనువాదకుల ప్యానెల్ తొలిసారి పూర్తిస్థాయిలో ఏర్పాటైందన్నారు. డిజిటల్ పార్లమెంట్ 2.0 కింద దాదాపు 8,000 గంటల ఆడియో-విజువల్ రికార్డింగ్‌ను డిజిటలీకరించినట్లు చెప్పారు. ఎంపీల ప్రసంగాలు, సభలో చర్చలు, ప్రశ్నోత్తరాలు తదితరాలను వినాలనుకునే యువతకు అవి నేడు డిజిటల్ మాధ్యమం ద్వారా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 'నేషనల్ ఇ-విధాన్' అప్లికేషన్ ద్వారా లోక్‌సభ కార్యకలాపాలన్నిటినీ కాగిత రహితం చేసేందుకు కృషి సాగుతున్నదని శ్రీ అమిత్ షా పేర్కొన్నారు.

కామన్వెల్త్ దేశాల ప్రిసైడింగ్ ఆఫీసర్ల 28వ సమావేశంలో లోక్‌సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా ప్రసంగానికి విస్తృత ప్రశంసలు లభించడం, భారత పార్లమెంట్ ప్రతిష్టను ఇనుమడింపజేసిందని హోంమంత్రి పేర్కొన్నారు. బిల్లులపై పార్లమెంటు సభ్యులకు ముందస్తు వివరాలు పొందే అవకాశం కల్పించింది ఆయనేనని చెప్పారు. బ్రిటిష్ పాలకులు నిర్మించిన భవనం నుంచి స్వతంత్ర భారతంలో కొత్త పార్లమెంట్ భవనానికి సభ మార్పు శ్రీ ఓం బిర్లా పదవీకాలంలోని కీలక పరిణామాలలో ఒకటని చెప్పారు. ఈ కార్యక్రమాలన్నింటినీ ఆయన ఏకాభిప్రాయంతో చేపట్టారని గుర్తుచేశారు.

దేశవ్యాప్తంగా తమ పార్టీ ప్రతిష్టను దెబ్బతీసేందుకు తప్పుడు సమాచార వ్యాప్తి విస్తృతంగా సాగుతున్నదని శ్రీ అమిత్ షా ఆరోపించారు. అయితే, ఇటువంటి ప్రయత్నాలేవీ తమ పార్టీ ప్రతిష్టను దెబ్బతీయజాలవనే వాస్తవం వారికి అర్థం కావడం లేదన్నారు. సభలో ఎవరు.. ఎప్పుడు.. ఎంత.. ఎందుకు మాట్లాడాలి అనే అంశాలను నిర్ణయించేది పాలక పార్టీ కాదన్నారు.

ప్రతిపక్షాల గొంతు నొక్కడానికి తమ పార్టీ ఎన్నడూ యత్నించలేదన్నారు. వాస్తవానికి తన గొంతును వినిపించకుండా చేసే కుట్ర చేస్తున్నారని శ్రీ అమిత్ షా ఆరోపించారు.

దేశంలో 1975నాటి ఎమర్జెన్సీ సందర్భంగా యావత్ ప్రతిపక్షాన్ని జైలుపాలు చేయడం ద్వారా వారి గళాన్ని అణచివేశారని ఆయన గుర్తుచేశారు. సభను నిబంధనల ప్రకారం నిర్వహించడం స్పీకర్ బాధ్యతని, లోక్‌సభలోని 349వ నియమం సభలో సభ్యుల ప్రవర్తనను నిర్దేశిస్తుందని చెప్పారు. కాగా, 17వ లోక్‌సభలో ప్రతిపక్ష పార్టీకి 52 మంది సభ్యులున్నా, 157 గంటల 55 నిమిషాలు మాత్రమే సమయం ఇచ్చారని కేంద్ర హోంమంత్రి అన్నారు. దానితో పోలిస్తే, తమ పార్టీకి 303 మంది సభ్యులు ఉన్నప్పటికీ, 349 గంటల 8 నిమిషాల సమయం మాత్రమే ఇచ్చారని తెలిపారు. ఈ సమాచారాన్ని పరిశీలిస్తే, అధికార పార్టీకన్నా ప్రతిపక్ష పార్టీ వారికే స్పీకర్ ఎక్కువగా మాట్లాడే వీలు కల్పించినట్లు శ్రీ అమిత్ షా పేర్కొన్నారు.

ప్రస్తుత 18వ లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష బలం 99 మందే అయినా, నిన్నటి దాకా 71 గంటలు మాట్లాడారని శ్రీ అమిత్ షా అన్నారు. దీనితో పోలిస్తే, 239 మంది సభ్యులున్న అధికార పార్టీకి 193 గంటల సమయం మాత్రమే మాట్లాడే సమయం ఇచ్చారన్నారు. అంటే- 18వ లోక్‌సభలో అధికార పార్టీతో పోలిస్తే ప్రతిపక్షానికి దాదాపు రెండు రెట్లు అధికంగా సమయం లభించిందన్నారు. కానీ, తనను మాట్లాడనివ్వడం లేదని, తన గొంతును అణచివేస్తున్నారంటూ ప్రతిపక్ష నాయకుడు ఫిర్యాదు చేస్తూనే ఉన్నారని చెప్పారు. విపక్ష నాయకుడికి మాట్లాడే అవకాశం వచ్చినప్పుడల్లా, ఆయన విదేశీ పర్యటనలో ఉంటున్నారని శ్రీ అమిత్ షా విమర్శించారు.

ప్రతిపక్ష నేత వంతు వచ్చినప్పుడల్లా ఆయన తరచూ జర్మనీ, వియత్నాం, యునైటెడ్ కింగ్‌డమ్, మలేషియా, సింగపూర్ దేశాల్లో ఉండేవారన్నారు. ఆ తర్వాత తిరిగ్గా వచ్చి తనకు అనుమతి ఇవ్వడంలేదని ఫిర్యాదు చేస్తుంటారని శ్రీ అమిత్ షా ఆరోపించారు. తన వంతు వచ్చినప్పుడు ప్రతిపక్ష నాయకుడు ఎందుకు మాట్లాడలేదో అడగాలనుకుంటున్నానని ఆయన చెప్పారు. ఆయనను నిజంగా మాట్లాడకుండా నిరోధించారా.. లోక్‌సభను కించపరిచేందుకే తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తున్నారని శ్రీ అమిత్ షా అన్నారు. ప్రస్తుత 18వ లోక్‌సభలో ప్రతిపక్షానికి 71 గంటలు సమయం ఇవ్వగా, ప్రతిపక్ష నాయకుడు ఎంతసేపు మాట్లాడారని ప్రశ్నించారు. లోక్‌సభ స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం మీద చర్చలో కూడా ప్రతిపక్ష నాయకుడు మాట్లాడలేదని, దానిపై తాను మాట్లాడేది ఏమీ లేకపోతే అలాంటి తీర్మానాన్ని ఎందుకు ప్రవేశపెట్టారని శ్రీ అమిత్ షా ప్రశ్నించారు. ప్రతిపక్ష నేతకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదనడం కూడా తప్పని ఆయన ఖండించారు. వాస్తవానికి సభలో మాట్లాడటం ఆయనకు నిజంగా ఇష్టం ఉండదని, మాట్లాడాలనుకుంటే నిబంధనల ప్రకారం ఎలా చేయాలో ఆయనకు తెలియదని వ్యాఖ్యానించారు. లోక్‌సభ అంటే బహిరంగ సభ కాదని, ప్రతి సభ్యుడూ సభా నియమాలకు అనుగుణంగా మాట్లాడాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

ప్రతిపక్ష నాయకుడిని దాదాపు 40 సార్లు మాట్లాడనీయలేదని ప్రతిపక్షాలు ఆరోపించినట్లు శ్రీ అమిత్ షా పేర్కొన్నారు. అయితే, స్పీకర్ వారిస్తున్నా ఒకే అంశాన్ని ప్రతిపక్ష నాయకుడు పునరావృతం చేస్తుంటే నిరోధించడం తప్ప ఆయనకు వేరే మార్గం ఉండదన్నారు. ప్రచురితం కాని పుస్తకం లేదా మ్యాగజైన్ల నుంచి ఏ అంశాన్నీ సభ్యులెవరూ ఉల్లేఖించరాదని రక్షణ మంత్రి స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు. ఒక సభ్యుడు ఒకే అంశంపై పదేపదే మాట్లాడాలని చూస్తే, స్పీకర్ జోక్యం చేసుకోక తప్పదని పేర్కొన్నారు. అలాగే, 'ఎస్ఐఆర్'పై చర్చలోనూ మాట్లాడాల్సిన సభ్యుల క్రమానికి ప్రతిపక్ష నాయకుడు అంతరాయం కలిగించారని శ్రీ అమిత్ షా ఆరోపించారు.

# ఖమ్మంలో పెన్షనర్ల ఆందోళన

## -యుద్ధ నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ప్రదర్శన ధర్నా




ఖమ్మం, మార్చి 13: భారత ప్రభుత్వం యుద్ధ నివారణ చర్యలు చేపట్టి నిత్యావసర వస్తువుల ధరలను అదుపులో ఉంచాలని డిమాండ్ చేస్తూ వందలాది పెన్షనర్లు నగరంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన చేపట్టారు. యుద్ధం వద్దు శాంతి ముద్దు ప్రపంచ శాంతి వర్ధిల్లాలి మానవహననాన్ని ఆపాలి పర్యావరణాన్ని కాపాడాలని పెన్షనర్లు ప్లకార్డులు చేతపట్టి వైరా రోడ్ లోని పెన్షనర్స్ భవన్ నుండి అంబేద్కర్ విగ్రహం వద్దకు ప్రదర్శన నిర్వహించారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన ధర్నా కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం సుబ్బయ్య టి వేణు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగుల ఉద్యోగ విరమణ ప్రయోజనాలు ఇవ్వకుండా గత రెండు సంవత్సరాల నుండి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న సమయంలో యుద్ధాన్ని ఆసరాగా చూపి నిత్యవసర వస్తువుల ధరలను పెంచడంతో రిటైర్డ్ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేంద్ర ప్రభుత్వం తక్షణమే యుద్ధ నివారణ కు పూనుకోవాలని తద్వారా నిత్యవసర వస్తువుల ధరలను అదుపులో ఉంచాలని అన్నారు. రాష్ట్ర కార్యదర్శి డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. అమెరికా ఇజ్రాయిల్ దేశాలు ఏకపక్షంగా ఇరాన్ పై దాడులు నిర్వహించడంతో దాని ప్రభావం భారతదేశంలో పడుతున్నదని బడి పిల్లలు అని చూడకుండా పాఠశాలల మీద బాంబులు వేయటం న్యాయం కాదని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రిటైర్డ్ ఉద్యోగుల ప్రయోజనాలు విడుదల చేయాలని అన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి ఆర్ వెంకట్ నారాయణ ఉపాధ్యక్షులు ఎన్ పూర్ణచంద్రరావు కార్యదర్శి టి జనార్ధన్ పి జానయ్య సీనియర్ నాయకులు సి బాబురావు తో పాటు ఖమ్మం నగర శాఖ నాయకులు పి బసవరావు ఆర్ రాధాకృష్ణ దొడ్డ రమేష్ జి ఆదినారాయణ నాగేశ్వరరావు సిహెచ్ బాబు సత్యనారాయణ వెంకటపతి రాజు ఆంజనేయులు పని రాజ్ కుమార్ గోవిందు మోహన్ దాస్ వెంకటేశ్వర్లు భాస్కర్ రెడ్డి గురవయ్య సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు-2026 నిర్వహించిన ఈఎస్ఐసీ.. దేశవ్యాప్తంగా 'ప్రత్యేక సేవా పక్షోత్సవాల' ముగింపు

న్యూఢిల్లీ, మార్చి 13:న్యూఢిల్లీలోని ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) ప్రధాన కార్యాలయంలో మార్చి 10న జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం-2026 వేడుకలతో ఈఎస్ఐసీ ప్రత్యేక సేవా పక్షోత్సవాలు-2026 విజయవంతంగా ముగిశాయి. మహిళా ఉద్యోగులు, లబ్ధిదారుల హక్కులు, గుర్తింపు, సంక్షేమానికి ఈఎస్ఐసీ కట్టుబడి ఉందని ఈ కార్యక్రమం స్పష్టం చేసింది.

ఈ కార్యక్రమానికి ఈఎస్ఐసీ డైరెక్టర్ జనరల్ శ్రీ అశోక్ కుమార్ సింగ్, ఫైనాన్షియల్ కమిషనర్ శ్రీమతి టి.ఎల్. యాదెన్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ శ్రీ మనీష్ కుమార్ అగర్వాల్, మెడికల్ కమిషనర్ (ఎంఈ) డాక్టర్ స్వప్న మిట్టల్ హాజరయ్యారు. అతిథిగా వక్త శ్రీమతి అంజు బబ్రీ, ఆశ్రయ్ ట్రస్ట్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ శ్రీ ముంజేశ్ యాదవ్, ఈఎస్ఐసీ ప్రధాన కార్యాలయ సీనియర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ ఏడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఇతివృత్తం 'త్యాగంలోనే ప్రతిఫలం'.. నిస్వార్థ సేవ పట్ల ఈఎస్ఐసీ అంకితభావాన్ని ఇది అద్భుతంగా ప్రతిబింబిస్తుంది. ఈ సందర్భంగా ఈఎస్ఐసీ డైరెక్టర్ జనరల్ శ్రీ అశోక్ కుమార్ సింగ్ మాట్లాడుతూ.. సామాజిక భద్రత పట్ల కార్పొరేషన్ నిబద్ధతకు ఈ ఇతివృత్తం శక్తిమంతమైన నిదర్శనమన్నారు. సమగ్ర ఆరోగ్య సంరక్షణ పథకాల ద్వారా దేశవ్యాప్తంగా మహిళా లబ్ధిదారులకు నాణ్యమైన వైద్య సేవలు, పటిష్ఠమైన సామాజిక భద్రతను అందిస్తూ, వారి సాధికారతకు ఈఎస్ఐసీ కృషి చేస్తుందని స్పష్టం చేశారు. 3.84 కోట్లకు పైగా బీమా లబ్ధిదారులకు, వారి కుటుంబాలకు సామాజిక భద్రత, ఆరోగ్య సేవలను ఈఎస్ఐసీ అందిస్తోంది. ముఖ్యంగా మహిళల ఆరోగ్యం, ప్రసూతి ప్రయోజనాలు, సమగ్ర సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తుంది. దేశవ్యాప్తంగా మహిళా లబ్ధిదారుల సాధికారత, ఆరోగ్యం, భద్రత, సంక్షేమానికి మద్దతిచ్చేందుకు ఈఎస్ఐసీ కట్టుబడి ఉందని ఈఎస్ఐసీ ఫైనాన్షియల్ కమిషనర్ శ్రీమతి టి.ఎల్. యాదెన్ తెలిపారు.

మహిళలు, బాలికలపై జరుగుతున్న దోపిడీ, వేధింపులను తీవ్రంగా వ్యతిరేకిస్తామని ప్రతిజ్ఞ చేస్తూ, ఆశ్రయ్ ట్రస్ట్ చేపట్టిన “పర్పుల్ రిబ్బన్ ప్లెడ్జ్” కార్యక్రమంలో ఈఎస్ఐసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ ముంజేష్ యాదవ్ నేతృత్వంలో ఈ ప్రమాణ కార్యక్రమం జరిగింది. సమాజంలో బలహీన వర్గాలకు రక్షణ కల్పించటంలో ఉమ్మడి సామాజిక బాధ్యత కీలకమని ఈ సందర్భంగా తెలియజేశారు.

తమను తాము గౌరవించుకోవాలని, ఆత్మవిశ్వాసంతో మార్పును ఆహ్వానించాలని అతిథిగా హాజరైన వక్త, లైఫ్ కోచ్ శ్రీమతి అంజు బబ్రీ మహిళలను ప్రోత్సహించారు. ఈఎస్ఐసీలోని ప్రతిభను గౌరవించే వేదికగా ఈ కార్యక్రమం నిలిచింది. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న మహిళా ఉద్యోగులతో పాటు పోస్టర్ పోటీల్లోని విజేతలను సన్మానించారు.

# ముస్లీంలు సుఖ సంతోషాలతో రంజాన్ జరుపుకోవాలి

## -మాజీ డీసీసీ అధ్యక్షురాలు సురేఖ

లక్షెట్టిపేట,మార్చి 13: ముస్లీంలు సుఖ సంతోషాలతో రంజాన్ పండుగను జరుపుకోవాలని మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక ఐబీ విశ్రాంత భవన్ లో రంజాన్ తోఫా పంపిణీలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు నాయకత్వంలో కొక్కిరాల రఘుపతి రావు ట్రస్ట్ ఆధ్వర్యంలో ముస్లీం కుటుంబాలకు ప్రతి ఏటా రంజాన్ తోఫాను అందిస్తున్నామన్నారు.

ప్రతి ముస్లీమ్ కుటుంబం పండుగ వేళ ఆనందంతో ఉండేలా అధికారంలో లేనప్పుడు, ఉన్నప్పుడు కూడా తోఫా పంపిణీని ఆపలేదని గుర్తు చేశారు. లక్షెట్టిపేటలో మొత్తం 823 మందికి చీరలు, 5 కిలోల బియ్యం, డ్రై ఫ్రూట్స్ తో కూడిన కిట్ ను అందిస్తున్నట్లు ఆమె వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉంటుందని తెలిపారు. సమాజంలోని అన్ని మతాలను సమానంగా ఆదరించేది కాంగ్రెస్ అని వివరించారు. రాబోయే రోజుల్లో లక్షెట్టిపేటను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు.

అంతకుముందు మున్సిపల్ చైర్ పర్సన్ దొంత అంజలి నర్సయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు నిరంతరం పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసమే పని చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే నాయకత్వంలో లక్షెట్టిపేటలో ఇంకా చాలా అభివృద్ధి పనులు జరుగుతాయని, ప్రజలు ఎమ్మెల్యేకు అండగా ఉండాలని కోరారు. అభివృద్ధి లో మున్సిపాలిటీని ఆదర్శంగా నిలుపుతామని తెలిపారు. అనంతరం పలువురు ముస్లీమ్ లకు మాజీ డీసీసీ అధ్యక్షురాలు సురేఖ చేతుల మీదుగా రంజాన్ తోఫా అందజేశారు.

ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు ఆరీఫ్,రమేష్,మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ వోతుక్కూరి రాజేశ్వరి వెంకటస్వామి గౌడ్, కౌన్సిలర్లు శనిగారపు చిన్నయ్య,తోట సువర్ణ,రాజేంద్ర ప్రసాద్, పెండెం పద్మ రాజు,సూరం చంద్రమౌళి, పర్వీన్ సుల్తానా, బిరుదుల సత్యనారాయణ, గోప సుజాత రమేష్, నాయకులు నాగభూషణం, చింత అశోక్, ముక్రమ్ జా, సర్పంచ్ నల్లపు రజిత పోషమల్లు, నందెల సురేష్, నలిమేల రాజు, దుమ్మని సత్యన్న, శాతరాసి బానేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉత్పత్తులకు అద్భుతమైన లేదా అతీంద్రియ గుణాలు ఉన్నాయని పేర్కొనే ప్రకటనల నిషేధానికి అడ్వర్టైజింగ్ కోడ్

న్యూఢిల్లీ, మార్చి 13:ప్రస్తుత నియంత్రణ వ్యవస్థ ప్రకారం, ప్రైవేట్ శాటిలైట్ టీవీ ఛానళ్లలో ప్రసారమయ్యే అన్ని ప్రకటనలు కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్స్ (రెగ్యులేషన్) యాక్ట్, 1995 కింద రూపొందించిన నిబంధనల ప్రకారం నిర్దేశించిన అడ్వర్టైజింగ్ కోడ్‌కు లోబడి ఉండాలి. అడ్వర్టైజింగ్ కోడ్‌లోని రూల్ 7(5) ఇతర అంశాలతో పాటు 'ప్రకటించిన ఉత్పత్తికి లేదా దానిలోని ఏదైనా పదార్థానికి నిరూపించడానికి కష్టతరమైన కొన్ని ప్రత్యేకమైన, అద్భుతమైన లేదా అతీంద్రియ లక్షణం, లేదా నాణ్యత ఉందని ప్రజలు భావించేలా ఎటువంటి ప్రకటనలు ఉండకూడదు' అని స్పష్టం చేస్తోంది. అడ్వర్టైజింగ్ కోడ్‌లోని ఏ నిబంధననైనా ఉల్లంఘించినట్లు తేలితే సంబంధిత ప్రైవేట్ టీవీ ఛానళ్లపై తగిన చర్యలు తీసుకుంటారు. అడ్వర్టైజింగ్ కోడ్‌ను కచ్చితంగా పాటించేలా మంత్రిత్వ శాఖ ప్రసారకర్తలకు ఎప్పటికప్పుడు సలహాలు కూడా జారీ చేస్తుంది.

వినియోగదారుల హక్కుల ఉల్లంఘన, అక్రమ వ్యాపార పద్ధతులు, అసత్యమైన లేదా తప్పుదోవ పట్టించే ప్రకటనలకు సంబంధించిన అంశాలను నియంత్రించడానికి, ఒక వర్గంగా వినియోగదారుల హక్కులను రక్షించడానికి, నిబంధనలు అమలు చేయడానికి వినియోగదారుల రక్షణ చట్టం, 2019 లోని సెక్షన్ 10 కింద కేంద్ర వినియోగదారుల రక్షణ సంస్థ (సీసీపీఏ) ను ఏర్పాటు చేశారు.

కేంద్ర వినియోగదారుల రక్షణ సంస్థ వినియోగదారుల రక్షణ చట్టం, 2019 లోని సెక్షన్ 18 ద్వారా సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ, తప్పుదోవ పట్టించే ప్రకటనలను తప్పుదోవ పట్టించే ప్రకటనలకు అనుమతులను నియంత్రించడానికి “మార్గదర్శకాలు, 2022”ను జారీ చేసింది. ఈ మార్గదర్శకాల్లో తప్పుదారి పట్టించని, సరైన ప్రకటనల కోసం నిబంధనలు, బైట్ ప్రకటనలు, సరోగేట్ ప్రకటనల నిషేధం, పిల్లలను లక్ష్యంగా చేసుకున్న ప్రకటనలు, ప్రకటనల్లో డిస్క్లెయిమర్‌లు, అలాగే తయారీదారులు, సేవలందించే సంస్థలు, ప్రకటనదారులు, ప్రకటన సంస్థల బాధ్యతలు వంటి అంశాలను నిర్దేశించారు.

మార్గదర్శకాల్లోని క్లాజ్ 13 ప్రకారం ప్రకటనలకు మద్దతు (ఎండార్స్‌మెంట్) ఇచ్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవడాన్ని తప్పనిసరి చేశారు. ప్రకటనలో ఇచ్చే ఏ మద్దతు అయినా అది ఆ వ్యక్తి, సమూహం లేదా సంస్థ నిజమైన, ప్రస్తుత అభిప్రాయాన్ని ప్రతిబింబించాలి. అలాగే, సూచిస్తున్న వస్తువు, ఉత్పత్తి లేదా సేవ గురించి తగిన సమాచారం లేదా అనుభవం ఆధారంగా ఉండాలి. అది ఏ విధంగానూ వినియోగదారులను మోసం చేసే విధంగా ఉండకూడదు. ఇంకా ఈ మార్గదర్శకాల ప్రకారం, ప్రస్తుతం అమల్లో ఉన్న ఏదైనా చట్టం ప్రకారం భారతీయ నిపుణులు ( తమ వృత్తికి సంబంధించిన ప్రకటనలకు మద్దతు ఇవ్వడానికి నిషేధం ఉంటే - అది భారతదేశంలో నివసించే వారైనా లేదా విదేశాల్లో ఉన్న వారైనా లేదా అలాంటి పరిస్థితిలో అదే వృత్తికి చెందిన విదేశీ నిపుణులు అయినా ఆ ప్రకటనలకు మద్దతు ఇవ్వడానికి అనుమతి ఉండదు.

ఈ రోజు లోక్‌సభలో శ్రీ డాక్టర్ ఎం.కె. విష్ణు ప్రసాద్ అడిగిన ప్రశ్నకు సమాచార, ప్రసార, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ ఒక లిఖిత పూర్వక సమాధానంలో ఈ వివరాలు తెలిపారు.

# పొగాకురహిత సమాజ నిర్మాణంలో మీడియాది కీలకపాత్ర

## - ధూమపాన దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాలి
## - 'నో స్మోకింగ్ డే'పై వర్క్‌షాప్‌లో వక్తలు
## - పీఐబీ ఆధ్వర్యంలో మీడియాకు వర్క్‌షాప్

న్యూఢిల్లీ, మార్చి 13 :ధూమపానం వల్ల కలిగే నష్టాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించడానికి మీడియా కృషి చేయాలని వక్తలు పేర్కొన్నారు. 'నో స్మోకింగ్ డే'(ప్రతి ఏడాది మార్చి రెండో బుధవారం) సందర్భంగా బుధవారం కవాడిగూడలో పత్రికా సమాచార కార్యాలయం(పీఐబీ).. వార్త (మీడియా వర్క్‌షాప్) కార్యక్రమం నిర్వహించింది. ధూమపానం వల్ల నష్టాలు, నో స్మోకింగ్ డే ప్రాముఖ్యత, ధూమపాన నివారణలో మీడియా పాత్ర వంటి అంశాలపై పీఐబీ-హైదరాబాద్ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రీమతి శృతి పాటిల్, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మానస్ కృష్ణకాంత్, ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్ఓ) కన్సల్టెంట్ డాక్టర్ శ్రీగణ, జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమం(ఎన్‌టీఈపీ) ఐఈసీ అధికారి శ్రీ ఎస్,జితేంద్ర హాజరై ప్రసంగించారు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్ఓ) కన్సల్టెంట్ డాక్టర్ శ్రీగణ మాట్లాడుతూ... ధూమపానం, పొగాకు వినియోగం వల్ల క్షయ సహా అనేక వ్యాధుల ముప్పు పెరుగుతుందని, శరీరంలోని కీలక అవయవాలు దెబ్బతింటాయని పేర్కొన్నారు. క్షయ వ్యాధికి పొగాకు వినియోగం ఆజ్యం పోస్తోందని, క్షయ బాధితుల్లో 8 శాతం మంది పొగాకు అలవాటు ఉన్నట్టు గణాంకాలు చెప్తున్నాయని గుర్తుచేశారు. ధూమపానం, మద్యపానం, అతిగా యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్ వాడటం వల్ల రోగనిరోధక శక్తి తగ్గిపోయి, త్వరగా వ్యాధుల బారిన పడతారని తెలిపారు. పొగాకు వ్యసనాన్ని మానుకోవాలనుకునే వారు నేషనల్ టొబాకో క్విట్‌లైన్ సర్వీసు టోల్ ఫ్రీ నెంబరు 1800 112 356కు ఫోన్ చేసి, సలహాలు పొందొచ్చని సూచించారు.




జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమం (ఎన్‌టీఈపీ) ఐఈసీ అధికారి శ్రీ ఎస్.జితేంద్ర మాట్లాడుతూ... ధూమపానం, పొగాకు ఉత్పత్తుల వినియోగం సమాజానికే నష్టమని అన్నారు. ధూమపానం చేసే వారి ఆరోగ్యానికి ఎంత నష్టమో, ఆ పొగను పీల్చే ఇతరుల ఆరోగ్యానికి కూడా అంతే నష్టమని పేర్కొన్నారు. పొగాకు వాడేవారిలో క్షయవ్యాధి ముప్పు కూడా ఎక్కువ అని అన్నారు. క్షయవ్యాధి పట్ల సమాజంలో ఉన్న దురభిప్రాయం, వ్యాపిస్తున్న తప్పుడు సమాచారాన్ని తగ్గించేందుకు మీడియా కృషి చేయాలని కోరారు.

పీఐబీ హైదరాబాద్ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రీమతి శృతి పాటిల్ మాట్లాడుతూ... పొగాకు ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలో మూడో స్థానంలో ఉందని, వినియోగంలో రెండో స్థానంలో ఉందని పేర్కొన్నారు. పొగాకు వ్యసనాన్ని తగ్గించేందుకు కేంద్రప్రభుత్వం జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమం(ఎన్‌టీసీపీ) చేపట్టిందని, సీఓటీపీ చట్టం చేసిందని గుర్తుచేశారు. ధూమపానం వంటి వ్యసనాలను నివారించడానికి ప్రజాభాగస్వామ్యం కీలకమని, ఇందుకోసం అవగాహన కల్పించడానికి మీడియా కృషి చేయాలని కోరారు.

పీఐబీ హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మానస్ కృష్ణకాంత్ మాట్లాడుతూ... చైనా తర్వాత ధూమపానం చేసే వారు భారత్‌లోనే ఎక్కువగా ఉన్నారని పేర్కొన్నారు. దేశంలో 28% మంది ధూమపానం చేస్తుండగా, పరోక్ష ధూమపాన ప్రభావం 42% మందిపై ఉంటోందని గణాంకాలు చెప్తున్నాయని అన్నారు. ధూమపానం, పొగాకు వినియోగం భవిష్యత్తుకు ప్రమాదంగా మారుతోందని అన్నారు. వీటి నివారణకు కేంద్రం నషా ముక్త్ భారత్ చేపట్టిన విషయాన్ని గుర్తుచేశారు.

పొగాకు నిర్మూలన స్వచ్ఛంద కార్యకర్త, టొబాకో కంట్రోల్ హీరో అవార్డుగ్రహీత మాచన రఘునందన్ మాట్లాడుతూ... ధూమపానం నిర్మూలనలో సమాజంలోకి ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం, పొగాకు ఉత్పత్తుల వినియోగాన్ని ప్రోత్సహించవద్దని కోరారు.

ఈ కార్యక్రమంలో మీడియా ప్రతినిధులు, పీఐబీ, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్(సీబీసీ) అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నేషనల్ యూత్ పార్లమెంట్ స్కీమ్ వెబ్ పోర్టల్ అప్‌గ్రేడ్ వెర్షన్‌ను ఆవిష్కరించిన పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, మార్చి 13: యూత్ పార్లమెంట్ కార్యక్రమాన్ని విస్తరించడం కోసం, మారుమూల గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల భాగస్వామ్యాన్ని విస్తృతం చేయడం కోసం, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఎన్‌వైపీఎస్ 2.0 పేరుతో నేషనల్ యూత్ పార్లమెంట్ స్కీమ్ (ఎన్‌వైపీఎస్) వెబ్ పోర్టల్ అప్‌గ్రేడ్ వెర్షన్‌ను ఆవిష్కరించింది. గుర్తింపు పొందిన విద్యా సంస్థల విద్యార్థులకు మాత్రమే పరిమితమైన మునుపటి వెర్షన్ స్థానంలో ప్రారంభించిన ఈ ఎన్‌వైపీఎస్ 2.0 పోర్టల్ దేశవ్యాప్తంగా ఉన్న అన్ని విద్యా సంస్థలు, గ్రూపులు, పౌరులందరి కోసం అందుబాటులో ఉంటుంది. గ్రామీణ ప్రాంతాలు, చిన్న సంస్థలు సహా దేశంలోని ప్రజలందరి కోసం లింగం, కులం, వర్గం, మతం, జాతి, ప్రాంతం, స్థానంతో సంబంధం లేకుండా అందరికీ అందుబాటులో ఉంటుంది. యూత్ పార్లమెంట్ సమావేశ భాగస్వామ్యం, నిర్వహణ వివరాలు కింది విధంగా ఉన్నాయి-

ఎన్‌వైపీఎస్ 2.0 గురించి సమగ్రత, అవగాహన కోసం మంత్రిత్వ శాఖ అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాల పరిపాలన సంస్థలు, రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల శాసనసభలు, వివిధ విద్యా బోర్డులకు (సీబీఎస్ఈ, సీఐఎస్‌సీఈ) లేఖ రాసింది. సంసద్ టీవీలో దీని గురించి ఎప్పటికప్పుడు ప్రచార వీడియోనూ ప్రసారం చేస్తోంది.

చట్టం, న్యాయ శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత), పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి శ్రీ అర్జున్ రామ్ మేఘ్వాల్ ఈ రోజు లోక్‌సభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో ఈ సమాచారాన్ని తెలిపారు.

# సాయి కృప ఆసుపత్రి సీజ్ చేసిన కలెక్టర్ బాదావత్ సంతోష్



వరంగల్, మార్చి 13: నాగర్ కర్నూల్ జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో నిర్వహిస్తున్న స్కానింగ్ సెంటర్ల పై ప్రత్యేక నిఘా పెట్టాలని, ఎక్కడైనా లింగ నిర్ధారణ పరీక్షలు లేదా అక్రమ అబార్షన్లు నిర్వహించినట్లు తేలితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్, కమిటీ సభ్యులు ఐ.ఎం.ఏ డిస్టిక్ ప్రెసిడెంట్ డాక్టర్ చెన్నయ్య, డి ఎం హెచ్ ఓ డాక్టర్ రవి నాయక్, అధికారులు పాల్గొన్నారు.

కొల్లాపూర్ పట్టణంలో ఉన్న సాయికృప ప్రైవేట్ ఆస్పత్రిలో ఇటీవల ఒక బాలికకు అక్రమంగా అబార్షన్ నిర్వహించారనే ఆరోపణలపై కమిటీ చర్చించింది. ఈ నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఆసుపత్రిని సందర్శించి సమర్పించిన నివేదికలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. జిల్లా కమిటీ నిర్ణయం మేరకు సాయికృప ఆసుపత్రిని సీజ్ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రకటించారు. జిల్లాలో ఎక్కడైనా ప్రైవేట్ ఆస్పత్రుల్లో స్కానింగ్ సెంటర్ల ద్వారా లింగ నిర్ధారణ పరీక్షలు లేదా అక్రమ అబార్షన్లు నిర్వహించినట్లు గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోను కలెక్టర్ ఆదేశించారు.

జిల్లాలో ఉన్న 38 స్కానింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా ఉంచి, ప్రైవేట్ ఆస్పత్రులపై తనిఖీలు ముమ్మరంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ మాట్లాడుతూ?.జిల్లాలో ఉన్న ప్రైవేట్ ఆసుపత్రుల్లో రిజిస్ట్రేషన్ లో పొందుపరిచిన నిబంధన మేరకు ఆసుపత్రులు కొనసాగుతున్నాయా లేదా అన్న అంశంపై వైద్య ఆరోగ్యశాఖ పర్యవేక్షణ జరపాలని కోరారు. స్కానింగ్ సెంటర్ల పై పటిష్ట నిఘా పెట్టాలని, ఇబ్బందులు ఉంటే పోలీసుల సహకారం తీసుకోవాలని కోరారు.

క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ రిజిస్ట్రేషన్, రెగ్యులేషన్ చట్టం, 2010 ప్రకారం, ఆసుపత్రులు, క్లినిక్‌లు, డయాగ్నోస్టిక్ సెంటర్లు , నర్సింగ్ హోమ్‌ల నిర్వహణ తదితర అంశాలపైనా దృష్టి సారించాలని ఎస్పీ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు డాక్టర్ లక్ష్మణ్, డిప్యూటీ డిమో రాజగోపాల్ చారి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలి

వరంగల్, మార్చి 13 : డీలర్లు అసోసియేషన్ నిర్ణయాలకు కట్టుబడి ఉండాలని, రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించాలని తెలంగాణ ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, సీడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు అన్నారు. సేల్స్ ప్రమోషన్లు, యూట్యూబ్‌లో అనైతిక ప్రచారాలు పూర్తిగా ఆపాలని సూచించారు. శుక్రవారం శివనగర్ లోని అసోసియేషన్ భవనలో రాష్ట్ర అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన వెంకటేశ్వర్లును సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసోసియేషన్‌లో చర్చించి తీసుకున్న నిర్ణయాలకు అందరూ కట్టుబడి ముందుకు సాగాలని కోరారు. రైతులకు వెన్నుదండగా నిలబడాలంటూ, నాణ్యతలో రాజీపడకూడదన్నారు. చిన్న తప్పు కూడా రైతుకు పెద్ద నష్టం కలిగిస్తుందన్నారు. కావున నాణ్యమైన కంపెనీల ఉత్పత్తులను మాత్రమే అందించాలని స్పష్టం చేశారు.

కొన్ని కంపెనీలు హైబ్రిడ్ క్వాలిటీలు చూపించకుండా విచ్చలవిడిగా అమ్మకాలు చేస్తున్నారని విమర్శించారు. మంచి ప్రొడక్ట్ ఉంటే రైతులకు, డీలర్లకు చూపించి ప్రమోట్ చేయాలని, యూట్యూబ్‌లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అసోసియేషన్‌ను మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో బలోపేతం చేయాలంటూ పిలుపునిచ్చారు. వరంగల్ నడిబొడ్డులో ఉన్నట్టు రాష్ట్ర స్థాయిలో కూడా భవన నిర్మాణం చేపడతామన్నారు. హైదరాబాద్‌కు వచ్చే ఎగ్జిక్యూటివ్ బాడీ సభ్యులకు రెస్ట్ రూమ్‌లు కల్పిస్తామని ప్రకటించారు. అసోసియేషన్ సభ్యుల సహకారంతో ఈ ప్రణాళికలు అమలు చేస్తామని చెప్పారు.

